అక్రమంగా నిల్వ చేసిన 58.30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

నవతెలంగాణ-మునిపల్లి



అక్రమంగా నిల్వ చేసిన 58.30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం సీజ్ చేశారు. అంతేకాకుండా నిందితులపై కేసు నమోదు చేశారు పూర్తి వివరాల్లోకి వెళ్తే.. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి నిల్వ ఉంచారన్న సమాచారంతో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం మునిపల్లి, సదాశివపేట్ మండలాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మునిపల్లి మండలంలోని కంకోల్‌లో బి సంతోష్ కుమార్ అనే వ్యాపారి దుకాణంలో 9.30క్వింటాళ్లు, అలాగే సదాశివపేటలోని బసవేశ్వర వాడకు చెందిన మ్యాదం మల్లేశం వ్యాపారి గోదాంలో 49క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఆ మొత్తం బియ్యాన్ని సీజ్ చేసి.. ఈ మేరకు కేసు నమోదు చేశారు. పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని మునిపల్లి, సదాశివపేట పోలీస్ స్టేషన్‌లకు తరలించినట్టు టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు.

జాతీయ స్థాయి కరాటేలో రాణించిన మర్కుక్ విద్యార్థినులు

నవతెలంగాణ-మర్కుక్



సికింద్రాబాదులోని క్లాసిక్ గార్డెన్ లో నిర్వహించిన జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ కఫ్ -2024 పోటీలలో మర్కుక్, పాములపర్తి పాఠశాల విద్యార్థులు గెలుపొంది గోల్డ్ మెడల్ సాధించారు.ఈ సందర్భంగా కరాటే మాస్టర్ సరిత మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కుక్ నుండి ముగ్గురు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాములపర్తి ముగ్గురు విద్యార్థులు ఈ పోటిలలో తలపడి విజయం సాదించి రెండు గోల్డ్ మెడల్స్, నాలుగు సిల్వర్ మెడల్స్ సాదించారని అమె తెలిపారు. మర్కుక్ పాఠశాల విద్యార్థినులు దుర్గమహేశ్వరి గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ షాలిని,రుచితలకు సిల్వర్ మెడల్, పాములపర్తి పాఠశాల విద్యార్థునులు అర్చన గోల్డ్‌మోడల్, వైష్ణవి, సింధుసిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు.



హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-మద్దూరు

ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ బాలుర జట్టుకు బిఆర్ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, తన సొంత ఖర్చుతో క్రీడా దుస్తులు పంపించగా వాటిని గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పాఠశాలలో హ్యాండ్ బాల్ సీనియర్ క్రీడాకారుడు, అసోసియేషన్ సంఘం సభ్యులు మహమ్మద్ అన్వర్ క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మద్దూరు హ్యాండ్ బాల్ కోచ్ దామెర మల్లేశం, మాట్లాడుతూ..ఈనెల 8 నుండి 10వ తేదీ వరకు వరంగల్ జిల్లాలోని పైడిపల్లి లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ క్రీడలలో మెదక్ బాలుర జట్టు పాల్గొంటుందని ఆయన తెలిపారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందించిన మేక సంతోష్ కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకన్న, మాజీ ఎంపీటీసీ బూరుగు నర్సింలు గౌడ్, పిడి దామెర ప్రేమ్ కుమార్, సీనియర్ క్రీడాకారులు ప్రభాకర్, చేతన్, కార్తీక్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సమాజ సేవలతోనే సమాజంలో గుర్తింపు

నవతెలంగాణ-మర్కుక్

సమాజ సేవలతోనే గుర్తింపును లభిస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ అధ్యక్షుడు పండరి అన్నారు. గురువారం మండలంలోని ఎర్రవల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో, రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, సమాజములో తాము రోటరీ క్లబ్ ద్వారా ఎన్నో రకాల సామాజిక సేవలు , కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. అందులో భాగంగానే విద్యార్థులకు కూర్చోవడానికి బెంచీలు ఇవ్వడం జరిగిందన్నారు. మర్కుక్, జగదేవ్ పూర్, గజ్వేల్ మండల పరిధిలో ఇలాంటి సామాజిక కార్యక్రమాలు ఎన్నో చేశామన్నారు. సమాజంలో గుర్తింపు రావాలంటే తమ సేవలను పేదలకు ఎంతో కొంత పంచినప్పుడే గుర్తింపబడతారన్నారు. అలాగే సమాజంలోని పేదలకు సామాజిక సేవలు చేయడములో రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ అసిస్టెంట్ గవర్నర్ హరిశంకర్, సెక్రటరీ హరికృష్ణ, సీనియర్ సభ్యుడు వి.వి.రమణ, సభ్యులు మొండి భిక్షపతి, తుమ్మ కృష్ణ, శివ, ప్రధా నోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు శ్రీశైలం, కుమార్ తదితరులున్నారు.

రవీంద్ర పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



నవతెలంగాణ-సిద్దిపేట

స్థానిక రవీంద్ర ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో గురువారం ఫుడ్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ హరికిషన్ తెలిపారు. నార్త్ ఇండియన్ , సౌత్ ఇండియన్ వంటకాలు , తెలంగాణ వంటకాలు దాదాపుగా 100 రకాల ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కవిత, శ్వేత, రేఖ, రజిత పాల్గొన్నారు.



కొండపాకలో దొంగల బీభత్సం

నవతెలంగాణ-కొండపాక

కొండపాకలో తాళం వేసిన ఇండ్లలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కోరమైన బాలమల్లు, కొమ్మురాజు ,బర్రె రాముల,జంజీరపు నర్సింలు ల ఇంటి తాళాలు పగల కొట్టి ఇంట్లో చొరబడి వస్తువులను చిందరవందర చేసి ఇంట్లో గల నగదు బంగారు నగలను అపహరించారు. బాలమల్లు ఇంట్లో 30 వేల నగదు తో పాటు 40000 విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ నాలుగిండ్లలో సుమారు రెండు లక్షల రూపాయల విలువైన నగదు ఆభరణాలను అపహరించారు. కుకునూరు పల్లి ఎస్సై శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.



శాశ్వతమైన ఐశ్వర్యం జ్ఞానం

నవతెలంగాణ-కొండపాక

శాశ్వతమైన ఐశ్వర్యం జ్ఞానమని ఈ ఐశ్వర్యాన్ని ఇచ్చేది ఈశ్వరుడని రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. కొండపాక రుద్రేశ్వరాలయంలో గురువారం మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేసి అనుగ్రహ భాషణం చేశారు. రుద్రేశ్వరుడు కొండపాకలో వెలియడం గ్రామస్తుల అదృష్టం అన్నారు. ప్రతి వ్యక్తిలో దైవాన్ని చూడాలని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అనంతల శ్యామ్ మోహన్, వెంకటరమణ శర్మ, రేణు కింది బాలయ్య, మంచాల కనక రాములు, రామకృష్ణారెడ్డి, బుక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ కుంభకోణం

- రాష్ట్రాన్ని రూ.7 లక్షల కోట్లు అప్పుల పాలు చేశారు
- బీఆర్ఎస్‌పై రాష్ట్ర విద్యవైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ విమర్శలు
- రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి
- మార్చి 11న మరో గ్యారంటీని అమలు చేస్తాం..

నవతెలంగాణ-జోగిపేట

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ కుంభకోణం జరిగిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజ నర్సింహ ఆరోపించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా ప్రాజెక్టులను నాసిరకంగా నిర్మించారన్నారు. అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో గురువారం దాదా పు రూ.138.10 కోట్ల అభివృద్ధి పనులకు కలెక్టర్ క్రాంతి వల్లూరుతో కలిసి శంకుస్థాపనాలు ప్రారంభోత్సవాలు చేశారు.

మెదక్ జిల్లా చరిత్రలోనే జోగిపేటకు గుర్తింపు ఉందని.. జిల్లాలోని మొట్టమొదటి డిగ్రీ కళాశాల ఇక్కడ ఏర్పాటయిందన్నారు. కొన్నేండ్లుగా జోగిపేట డిగ్రీ కళాశాలలో నిలిచిపోయిన తెలుగు మీడియం బీకాం జనరల్ కోర్సును తిరిగి ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రూ.158.36 కోట్లతో అల్మాయిపేట వద్ద 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జోగిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.2.13 కోట్లతో పెండింగ్ పనులు, రూ. 6కోట్లతో మున్సిపల్ నూతన భవనం నిర్మాణ పనులను, రూ.4.15 కోట్లతో డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సంగుపేట వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీ గోడల నిర్మాణ పనులు, రూ.20 కోట్ల నిధులతో సంగుపేట నుంచి అన్నసాగర్ వరకు నాలుగు లైన్ల నేషనల్ హైవే రోడ్డు బటర్ ఫ్లై లెట్స్, రూ.2 కోట్లతో జోగిపేట స్టేడియం అభివృద్ధి, ఆందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో రూ.20 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణపనులు, పలు అభివృద్ధి పనులను శంకుస్థాపనలకు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టుల పేరిట రూ.లక్షల కోట్లను దోచుకున్నారని, గత తొమ్మిదేళ్ల పాలనలో అవినీతి, మోసం, అబద్దాలు, దోపిడీ జరిగిందని విమర్శించారు. 60 ఏండ్ల సుదీర్ఘ పోరాటంలో సాధించుకున్న తెలంగాణతో బతుకులు మారుతాయనుకుంటే అంతా అవినీతిమయమైందన్నారు. రాష్ట్రాన్ని రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా తయారు చేసింది బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. కాంగ్రెస్ పాలనలో నిర్మించిన నాగార్జున సాగర్, పోచంపాడ్, సింగూర్ ప్రాజెక్టులు వంటివి నిర్మిస్తే వాటిపై ఏలాంటి ఫిర్యాదులు రాలేవని, నష్టం జరగలేదని, నిర్మాణంలో ఏలాంటి లోపం లేదన్నారు.



-40 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి..

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన 200 యూనిట్‌ల ఉచిత విద్యుత్‌తో రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరనుందన్నారు. జీరో బిల్లులను లబ్దిదారులకు మంత్రి దామోదర్ అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడంలో ముందుంటుందన్నారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 168903 కుటుంబాలకు, జోగిపేట డివిజన్ పరిధిలో 29832 కుటుంబాలకు ఉచిత విద్యుత్‌కు అర్హులని ఆయన తెలిపారు.

-మార్చి 11న మరో గ్యారంటీని అమలు చేస్తాం..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పామని ఆ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటివరకు మహిళలకు ఆర్‌టీసీ ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ రూ.10 లక్షలకు పెంపు, రూ.500లకే గ్యాస్ సిలీండర్, 200 యూనిట్‌ల ఉచిత విద్యుత్‌లను అమలు చేస్తున్నామన్నారు. మార్చి 11న ఇందిరమ్మ ఇండ్ల పేరిట పేదలకు జాగా ఉన్న వారికి రూ.5 లక్షలు, స్థలాలు లేని వారు 100 గజాల స్థలాన్ని ఇవ్వబోతున్నట్లు ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మార్చి 17నాటికి 100 రోజులు కాబోతుందని, అప్పటిలోగా ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చే దిశగా ప్రయత్నం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేష్ షేట్కార్, విద్యుత్ ఎస్పీ మాధవరెడ్డి, డిఈ శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్లు జగన్మోహన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, జోగిపట మాజీ సర్పంచ్ ఎస్ .కృష్ణారెడ్డి ,చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ డేవిడ్, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్‌గౌడ్, ఆకుల చిట్టిబాబు, రంగ సురేష్, డాకూరి శంకర్, పి.రేఖా ప్రవీణ్, హరికృష్ణాగౌడ్, కే. నాగరాజ్, దుర్గేష్, చందర్, కోఆప్షన్ సభ్యులు అల్లే శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ డిజి వెంకటేశం, మాజీ ఏఎంసీ చైర్మన్ పద్మనాభ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డాకూరి శ్రీనివాస్, చిట్యాల మధు, తాటికొండ శ్రీధర్, ఉలవల సతీష్, రాజశేఖర్, రవి, శ్రీనివాస్, రాములు అనిల్ రాజ్, వ్యాపారస్తులు బసవ సత్యప్రకాష్, ఆంజనేయులు, విట్టల్ రావు, రమేష్, చింతకుంట బిక్షపతి, రెడ్డిపల్లి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పీఆర్టీయూ సంఘ భవనానికి కృషి చేయాలి

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలో పీఆర్టీయూ సంఘానికి 400 గజాల స్థలానికి కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహకు అందోల్ మండల కమిటీ, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆకుల మానయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. పీఆర్టీయూ సంఘం కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందుకు మంత్రి స్పందిస్తూ.. పీఆర్టీయూ సంఘానికి స్థలాన్ని కేటాయించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరోత్తం కుమార్, రాజమల్లు, నాయకులు మధుసూదన్, మహేష్ చారి, సుభాష్, నవీన్, శివరాజ్, మంజ నాయక్, అనిల్, రమేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా అమ్మ భగవాన్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని ముదిరాజ్ సంఘం భవనంలో అమ్మ భగవాన్ 76వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలతో అలంకరించి హారతి ఇచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలు ఆయు రారోగ్యాలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని భక్తులు కోరుకున్నారు. అమ్మ భగవాన్ సేవాసమితి సభ్యులు అడ్వకేట్ టి. సత్యనా రాయణ, అనిల్ కుమార్ హెడ్మాస్టర్, అరుణ, లలిత, మహేందర్‌రెడ్డి, పవన్ కుమార్ మురళీధర్, సిద్ధన్న తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాపాలు.. కాంగ్రెస్ పార్టీ లోపాలు

పాలమూరు పాలిట శాపాలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు

నవతెలంగాణ-సంగారెడ్డి

చంద్రబాబు పాపాలు.. కాంగ్రెస్ పార్టీ లోపాలు... పాలమూరు పాలిట శాపాలుగా మారాయని మాజీ మంత్రి, సిద్దిపేట ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు వేదికగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్ వెనుకబాటు తనానికి నాటి టీడీపీ, కాంగ్రెస్ పాలనలే కారణమన్నారు. రేవంత్ తిట్టాల్సి వస్తే తన గురువు చంద్రబాబును తిట్టాలని.. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను నిందించాలన్నారు. పాలమూరు వలసలకు కారణం కాంగ్రెస్, టీడీపీలే అని దుయ్యబట్టారు. గత పార్టీలు ప్రాజెక్టుల పేర్లు మార్చాయి తప్పా.. పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టును రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన కేసీఆర్‌ను తిట్టడం అవివేకమని ధ్వజమెత్తారు. 'పేగులు మెడలో



వేసుకొని రాక్షసులు తిరుగుతాం' అంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. అది సీఎం మాట్లాడే భాషేనా..? పడిగట్టు పదాలు, పరుష పదజాలంతో పరిపాలన సాగదని హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నట్టు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్ కిట్లు తెస్తే, రేవంత్ రెడ్డి తిట్లతో పోటీ పడుతున్నడని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మహబూబ్ నగర్ జిల్లా ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేస్తున్నడన్నారు. పదేళ్లు చంద్రబాబు దత్తత తీసుకొని ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదన్నారు. పాలమూరు వలసలు వాపస్ చేసింది కేసీఆర్ మాత్రమే అన్నారు. వలసలకు నిలయం నాటి పాలకులు చేస్తే, వ్యవసాయానికి నిలయం చేసింది కేసీఆర్ అని అన్నారు. పాలమూరు ప్రాజెక్టులను కాగితాలకు పరిమితం చేసింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. 60 ఏండ్ల మీ పాలనలో ఒక్క కాలేజీ ఏర్పాటు చేయలేదని దుయ్యబట్టారు. చిత్తశుద్ధి ఉంటే ఆరు నెలల్లో నీళ్ల వాటా తేల్చే ప్రయత్నం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నాయని ప్రజలను దృష్టి మరల్చే యత్నం సరికాదు అని హితవు పలికారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, గాలి అనిల్ కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజేందర్, కొండల్‌రెడ్డి, నరహరి రెడ్డి, నందకిషోర్, మఠంబిక్షపతి, మనోహర్‌గౌడ్,అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా రాణించాలి

బి.లక్ష్మి, అడ్వకేట్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు

నవతెలంగాణ-సంగారెడ్డి



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కార్పొరేట్ సంస్థలు ఒక సంబురం లాగా నిర్వహిస్తున్నారు. కానీ అంతర్జా తీయ మహిళా దినోత్సవానికి ఘనమైన చరిత్ర ఉన్నది' అని అడ్వకేట్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షు రాలు బి.లక్ష్మి అన్నారు. అంత ర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రత్యేకంగా నవతెలంగాణతో పలు విషయాలను పంచుకున్నారు.

1908వ సంవత్సరంలో మార్చి 8న న్యూయార్క్ మహానగరంలో సూదుల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వేలాది మంది మహిళలు బాల కార్మిక వ్యవస్థను రద్దు చేయాలని, ప్రమాదకర పని పరిస్థితులను తొలగించాలని, మెరుగైన వేతనాలు ఇవ్వాలని ఐక్యమై ఉద్యమించారు. వాళ్ళ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందే నేడు మనం నిర్వహించుకుంటున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం. నేడు మన భారత దేశంలో ఒకవైపు పట్టణ ప్రాంతాల్లో బాలిక విద్యపై అవగాహన పెరిగింది. వేలాదిమంది సంఘటిత, అసంఘటిత రంగంలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఉన్నత స్థానాల్లో ఎదుగుతున్నారు. ప్రతీ రంగంలో మహిళలు ముందుంటున్నారు. మరోపక్క గ్రామీణ ప్రాంతాల నుంచి బాలికలు ఉన్నత విద్యను అభ్యసించలేకపోతున్నారు. స్థానికంగా ఉన్నత విద్యను అభ్యసించే కళాశాలలు, యూనివర్సిటీలు లేక పోవడంతో ఒంటరిగా పట్టణాలకు రాలేక చాలా మంది యువతలు ఉన్నత విద్యకు దూరంగా ఉంటు న్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు కూడా బాలిక ఉన్నత విద్యకి అడ్డుగా నిలుస్తున్న పరిస్థితి ఉన్నది. మహిళల కోసం అనేక చట్టాలు ఉన్నా వాటిపై చాలా తక్కువ మందికి అవగాహన ఉంది. మహిళ చట్టాల పైన ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలి. నేడు మహిళలోకం అనుభవిస్తున్న హక్కులను రాజ్యాంగంలో పొందుపరిచిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కి భారతదేశ మహిళా జాతి ఎప్పటికీ రుణపడి ఉంటుంది. నేటి సమాజంలో మహిళలే ఎక్కువ మంది విడాకులు కోరుతున్నారని.. దానికి అమ్మాయి తల్లిదండ్రులు తోడ్పాటును అందిస్తున్నారని చాలామంది అంటున్నారు. వాస్తవానికి నేడు అమ్మాయిలు చదువుకొని ఉద్యోగాలు చేస్తు న్నారు. వారికి ఆర్థిక స్వాతంత్రం ఉంది. కాబట్టి హింసను భరించలేక వారు విడాకులు తీసుకుంటే తల్లిదండ్రులు సరే అంటున్నారు. ఆత్మహత్యలకు పాల్పడితే కూతుర్ని దూరం చేసుకోవడం కంటే భర్త వదిలేసిన కానీ తమ కూతురు ప్రాణాలతో తమ వద్దే ఉంటుందని సర్దుకుపోతున్నారు. ఏ దేశమైనా ఎంత అభివృద్ధి చెందిందో తెలుసుకోవాలంటే ఆ దేశంలో మహిళ ఏ స్థానంలో ఉందో చూస్తే సరిపోతుంది. ఒక మహనుభావుడు మనదేశంలో నేటికీ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, మహిళలు ఇంకా వెనుకబడి ఉన్నారని చెప్పారు. ఉదాహరణకు రాజకీయంగా 33శాతం రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో పాసైనా కానీ 2029 నుంచి అమలు చేస్తావనడం ఎంతవ రకు సమంజసం. ఉద్యోగాలు చేసే మహిళల సంఖ్య పెరిగినా.. సంపాదించిన జీతాన్ని భర్తకు ఇవ్వడం, కుటుంబం కోసం మాత్రమే ఖర్చు పెడు తుంది. తన కోసం ఖర్చు చేసుకోవడానికి ఏ మహిళా సిద్ధం గా లేదు. తనకేదైనా అవసరం ఉన్నా గాని భర్త అంగీకరిస్తేనే తీసుకుంటుంది. సామాజికంగా నేటికీ మహిళ రెండో తర గతి పౌరురాలే.. నాటి నుండి నేటి వరకు మన దేశంలో అవ కాశం వస్తే అత్యద్భుతాలు సాధించిన మహిళా మణులు ఎంతోమంది ఉన్నారు. ఒక ఝాన్సీ లక్ష్మీబాయి, సావిత్రి బాయి పూలే, మదర్ తెరిసా, రమాబాయి అంబేద్కర్, కల్పనా చావ్లా, పి.టి ఉష, ఇందిరా గాంధీ ఇలా ఎంతోమంది ఉన్నా రు. ప్రతి మహిళ తమ పిల్లలను నైతిక విలువలతో, క్రమశి క్షణతో, తోటి వారితో సోదర భావంతో మెలగాలని, దేశభ క్తితో పెంచాలి నేటి మన పిల్లలే రేపటి మన దేశ భవిష్యత్తు. మన పిల్లలను ఉన్నతులుగా తీరిదిద్ది ఈ అభివృద్ధిలో మనందరం భాగస్వాములమవుదాం.



సైన్స్‌తోనే సమాజ పురోగతి..

నవతెలంగాణ-పటాన్‌చెరు

సైన్స్‌తోనే సమాజ పురోగతి సాధ్యమవుతుందని మనకు కావాల్సిన కొత్త పరిజ్ఞానాన్ని సృష్టించడంతో పాటు జీవన నాణ్యతను పెంచుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండలంలోని ఇస్నాపూర్‌లో గల శ్రీ వైష్ణవి హై స్కూల్‌లో గురువారం జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో కాంగ్రెస్ నాయకులు, ఇస్నాపూర్ ఎంపీటీసీ సభ్యులు గడ్డం శ్రీశైలంతో కలిసి పాలొని మాట్లాడుతూ.. సైన్స్ ప్రమేయం లేకుండా ఈ విశాల విశ్వంలో ఏదీ లేదన్నారు. ఏ విషయం తీసుకున్నా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అది సైన్స్‌తో సంబంధం ఉంటుందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంచుకొని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బురిగారి అంజీ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ పెంటయ్య, రవి, రాఘవేంద్ర, మణికంఠ,రాజు, తన్వీర్, రహీమ్, అంతయ్య, నవీన్, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎన్ఎంఆర్ యువసేనసభ్యులు పాల్గొన్నారు.

బీవీఆర్ఐటిలో కొనసాగుతున్న ఈ-బాజా పోటీలు





నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ-బాజా జాతీయ విద్యుత్ వాహనాల పోటీలు ఘనంగా కొనసాగుతున్నాయి. అయితే రెండోరోజైన గురువారం వాహనాలు సాంకేతిక బ్రేక్ నియంత్రిత ట్రాయల్స్‌లో ధ్రువీకరణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దుబే మాట్లాడుతూ.. బీవీ రాజు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న బాజా సైండియా పోటీలకు దేశవ్యాప్తంగా 71 టీమ్‌లలో 2450 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారనారు. ఈ పోటీలు 17వ ఎడిషన్ విష్ణు మోటార్స్ స్పోర్ట్స్ బివి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండోరోజు జరిగిన పోటీల్లో ప్రతి వాహనం బ్రేక్ పరీక్షలు, సాంకేతిక మూల్యాం కనం, శాఖ అబ్జర్వ్ వర్స్, డైనమిక్ సంఘటనలు, ధ్రువీకరణ ఈవెంట్స్, ఖర్చు ఆర్థిక ఫైనాన్స్, డిజైన్ ఈవెంట్, ఫైనల్స్ ఇన్నోవేషన్స్, ద్రోణాచార్య వంటి వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దుబే, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ రిలేషన్స్ డ్ర సతీష్ చంద్ర పరుచూరి, విష్ణు మోటార్ స్పోర్ట్స్ మేనేజర్ మనోనీత్ కుమార్, డీజీఎం కాంతారావు,డాక్టర్ కేసి వొర, ఎస్ బాల రాజ్ బజాజ్ సైన్ ఇండియా డాక్టర్ అరుణ్ అపురా, హీరో మోటో కార్ప్ కంపెనీ సిటిఓ, మేనేజర్ బాపిరాజు అశోక్ రెడ్డి సురేష్, నిర్వాహకులు, బజాజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోవలెంట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

వరుస ప్రమాదాలకు కారణమవుతున్న కోవలెంట్ పరిశ్రమ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో పరమేశ్వరుకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్లమాచనూర్ గ్రామ పరిధిలోని కోవలెంట్ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వలన గత ఏడాది కాలంలో మూడుసార్లు ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోవడమే కాకుండా.. ఎంతోమంది గాయపడ్డారన్నారు. అయినప్పటికీ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదని విమర్శించారు. ప్రమాదాలకు కారణమైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత పర్యవేక్షణ చేయాల్సిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ విభాగం అధికారుల నిర్లక్ష్యం వల్లే ఏడాదిలో మూడుసార్లు ప్రమాదాలు జరిగినట్లు అనుమానాలు వస్తున్నాయన్నారు. జిల్లాలో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆ శాఖ అధికారులపై



తక్షణమే చర్యలు తీసుకోని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కోవలెంట్ పరిశ్రమలో వరుస ప్రమాదాల పై విచారణ జరిపించాలని కోరారు. మార్చి 4 నుంచి 10 వరకు పరిశ్రమల భద్రత వారోత్సవాలు నిర్వహించిన అధికారులు.. ఇక్కడ నిర్వహించకపోవడం వల్లనే వరుస ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అదే విధంగా పర్మినెంట్ నేచర్ ఆఫ్ వర్క్స్ కాంట్రాక్ట్ కార్మికులకు తక్కువ వేతనాలకు ఇచ్చి.. విచ్చల విడిగా పని చేయించడం ద్వారా కూడా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటిపై విచారణ జరిపి కార్మికులకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు విద్యాసాగర్, నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని ముంగి గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీలో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను పంచాయతీ సెక్రెటరీ మజార్ అలీ, గ్రామ నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. కాగా రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు ముంగి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి,



సక్కులాల్, శివరాజ్ స్వామి, గ్రామస్తులు ఉన్నారు.

మల్కాపూర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కొండాపూర్

ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.15 లక్షల నిధులతో మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో సీసీరోడ్డు పనులను ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు భాస్కర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలభివృద్దే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. తనవంతుగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మెన్ కుమార్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు అనిల్, ఫహీం, తదితరులు పాల్గొన్నారు.

కమలమ్మ మృతి పార్టీకి తీరని లోటు

నవతెలంగాణ-జహీరాబాద్



కమలమ్మ మృతి పార్టీకి తీరని లోటు అని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. రంజోల్ కి చెందిన మాజీ ఎంపీటీసీ మోటాటి రామ్‌రెడ్డి మాతృమూర్తి మోటాటి కమలమ్మ గురువారం మృతి చెందింది. ఈ విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే.. వెంటనే మృతురాలి నివా సానికి భౌతికకాయానికి నివాళ్లర్పి ంచారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మిథున్ రాజ్, గ్రామ ముఖ్య నాయకులు మహమ్మద్ బాసిత్, వైద్యనాథ్, భాస్కర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, అనుపమ సంజీవ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళ లేనిది ఈ సృష్టి లేదని.. మహిళా శక్తిని గుర్తు చేశారు. సృష్టికి మూలం అమ్మ అని.. ప్రతీ మగవాడి విజయం వెనకాల ఓ మహిళా ఉంటుందని గుర్తు చేశారు. మహిళలందరూ ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు చాందిభాయ్, మోతిబాయ్, సర్పంచ్లు పల్లవి స్వప్న, నాయకులు రాలు జ్యోతి, వాణి, అపర్ణ, జయశ్రీ, ప్రతిభ, మహిళా టీచర్‌లు, ఆశా వర్కర్‌లు అంగన్వాడీ, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యనాథ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

నవతెలంగాణ-సంగారెడ్డి

వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా మహిళా అధికారులను శాలువాతో సత్కరించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని.. వారి హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వావిలాల పీఏసీఎస్ అవిశ్వాస సమావేశం

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం వావిలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సంబంధించి అవిశ్వాస సమావేశాన్ని గురువారం అధికారులు నిర్వహించారు. జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్ తుమ్మ ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. పీఏసీఎస్ వావిలాలలో మొత్తం 13 మంది సభ్యులు ఉండగా అవిశ్వాసానికి సం బంధించిన సమావేశానికి కాంగ్రెస్ మద్దతుదారులైన ఎనిమిది మంది సభ్యులు హాజరు కాగా, బీఆర్ఎస్ మద్దతుదారులైన ఐదుగురు సభ్యులు సమావేశానికి రాలే దు. ఇదిలా ఉండగా ఇటీవల వావిలాల పీఏసీఎస్ చైర్మెన్ శంకర్‌రెడ్డిపై అవిశ్వా సానికి కొందరు సభ్యులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అవిశ్వాస సమావేశంజరిగిందని స్థానికులు తెలిపారు.

కోర్టును ఆశ్రయించిన చైర్మెన్ శంకర్ రెడ్డి..

వావిలాల పీఏసీఎస్ చైర్మెన్ శేరికారి శంకర్ రెడ్డిపై అవిశ్వాసానికి సంబ ంధించిన ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో ఆయన కోర్టును ఆశ్రయించారని, 15వ తేదీ వరకు ఫలితం ఏమిటో తెలియదని స్థానికులు కొందరు చర్చించుకున్నారు.



గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ప్రభుత్వ గుర్తింపు లేకుండా అడ్మిషన్స్ కొనసాగిస్తున్న పల్లవి మోడల్ స్కూల్ యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి విశ్వనాథ్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కిందిదొడ్డి సతీష్ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ డివిజన్ కేంద్రంలో పర్మిషన్ లేకుండానే పల్లవి మోడల్ స్కూల్ పేరుతో అడ్మిషన్స్ కొనసాగుతున్నాయన్నారు. కాబట్టి మండల వైద్యాధికారులు వెంటనే స్పందించి ఆ స్కూల్ యాజమాన్యం పైన క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. లేని యెడల భవిష్యత్తులో ఉద్యమాలు ఉధృతం చేసి అధికారుల పైన చర్యలు తీసుకొనే విధ ంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. పిల్లల పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పర్మిషన్ ఉన్న స్కూల్‌లో అడ్మిషన్ చేయాలని తల్లిదండ్రులకు సూచి ంచారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, రాజు పాల్గొన్నారు

ఎలక్టోరల్ బాండ్లను బహిర్గతం చేయాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు

సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినప్పటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎలక్టోలర్ బాండ్లను బహిర్గతం చేయకపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి ఎన్డీఏ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ పిలుపులో భాగంగా పట్టణంలోని ఎస్బీఐ బ్యాంకు ఎదుట కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ఈ పథకం 2017లో ప్రవేశపె ట్టినప్పటి నుంచి రూ.12 వేల కోట్లకు పైగా అందుకోగా అందులో ఒక్క బీజేపీనే రూ.26,566,11 కోట్లను అందుకున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

నవతెలంగాణ-జహీరాబాద్



ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ పద్ధతిలో గత 20 ఏండ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న నర్సులుతో పాటు వైద్యశాఖలో వివిధ రంగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గత మూడు నెలల నుండి జీతాలు చెల్లించడం లేదని.. వెంటనే వారికి జీతాలు ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ వర్కర్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జేమ్స్ అన్నారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడ ుతూ.. సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న తమ సిబ్బందితో రాష్ట్ర ప్రభుత్వం బస్తీ దవాఖానాలు, కమ్యూనిటీ వైద్యశాలలో, పిహెచ్సీ సెంటర్లలో వివిధ రంగాల్లో సేవలు చేయించుకుంటుందన్నారు. కాగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఇప్పటికే ఉద్యమాలు నిర్వహించి.. గత ప్రభుత్వానికి కూడా ఎన్నో సార్లు మొర పెట్టుకున్నామన్నారు. ఇటీవలే జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాల తనిఖీకి వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు కూడా మెమోరండం అందించావమన్నారు. మహిళా ఉద్యోగినిలకు ప్రసూతి సెలవులు ఇవ్వకపోవడంతో.. అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.




కాజిపల్లి లో అక్రమ కట్టడాల కూల్చివేత

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని కాజిపల్లి పారిశ్రామిక ప్రాంతంలో 181 సర్వేనెంబర్ ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలను గురువారం కూల్చి వేసినట్టు తహసీల్దార్ బిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జయప్రకాష్ నారాయణ బృందం పాల్గొన్నారు.

బి.బి పాటిల్ రాకతో..
బీజేపీలో లుకలుకలు



- అధిష్టానం ముందే నిరసన వ్యక్తం చేసిన జైపాల్ రెడ్డి
- సొంతగూటికి వెళ్తాడని అనుచరుల హల్చల్..

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. గత కొన్ని నెలల క్రితం సీటు ఆశించి బీజేపీలో చేరిన మాజీ ఎంపీ కీర్తిశేషులు బాగారెడ్డి తనయుడు, డీసీసీబీ మాజీ చైర్మెన్ జైపాల్‌రెడ్డికి టిక్కెట్ లభించకపోవడంతో ఆయన క్యాడర్‌లో ముసలం నెలకొన్నది. పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు శాసన సభ కేంద్రాల్లో గత ఆరు నెలలుగా పెద్ద ఎత్తున ఆయన ప్రచారం చేస్తూ.. కార్యకర్తల్లో, ప్రజల్లో తనకంటూ ఒక ముద్ర సంపాదించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పార్లమెంటు నియోజ కవర్గంలో పర్యటించి వివిధ రకాల సేవా కార్యక్రమాలను చేపట్టారు. బీజేపీ గ్రాఫ్ పెంచేందుకు, తన అనుచరులందరిని బీజేపీలో చేర్పేందుకు ఎంతో కృషి చేశారు. ఒక సామాజిక వర్గంలో మంచి పట్టు ఉన్న నాయ కుడు జైపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరుతు ంటే.. నియోజకవర్గంలోని వివిధ వర్గాల నుంచి తీవ్రస్థాయిలో విముఖత వ్యక్తం అయింది. చివరికి చనిపోయిన తన తండ్రి, కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు కీర్తిశేషులు బాగారెడ్డి ఫోటోలు బీజేపీ కటౌట్‌లపై కనిపిస్తే.. కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. అంత వ్యతిరేకత వచ్చిన ప్పటికీ.. ఢిల్లీ స్థాయిలో బీజేపీ నాయకుల నుంచి జహీరా బాద్ పార్లమెంటు టికెట్‌ను కేటాయిస్తామన్న హామీ రావడం తో.. బీజేపీలో చేరి పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. అయినప్పటికీ ఆయనకు టిక్కెట్ రాకపోవడంతో తీవ్ర కుంగుబాటులో ఉన్నట్టు సమాచారం.

మరోపక్క బీజేపీలో కురువృద్ధుడైన ఎల్లారెడ్డి సైతం టికెట్‌ను ఆశించి జైపాల్‌రెడ్డితో సమానంగా పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించిన విషయం తెలిసింది. కానీ ఇటీవలే జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరగా.. చేరిన రెండో రోజే జహీరాబాద్ అభ్యర్థిగా ఆయన పేరును అధిష్టానం ప్రకటించింది. దాంతో సుదీర్ఘ కాలంగా బీజేపీలో క్రమశిక్షణతో మెలిగిన కార్యకర్తలందరూ మనో వేధనకు గురయ్యారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సైతం నిరసన సెగలు తగిలియి. అయినప్పటికీ బీబీ పాటిల్‌కు బీజేపీ జాతీయ అధి ష్టానంతో ఉన్న సంబంధాల వల్ల ఆయనకే టిక్కెట్ కన్ఫార్మ్ అయ్యింది. ఏండ్ల తరబడి పార్టీలోనే వివిధ శాఖల్లో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన కార్య కర్తలను పక్కనపెట్టి.. కేవలం డబ్బులు పెట్టు బడి పెడతాడన్న లక్ష్యంతో బీబీ పాటిల్‌కు టికెట్ కేటాయించారంటూ సొంతపార్టీ నాయకులే వ్యతిరేక గళం వినిపిస్తున్నారు. ఇటీవలే పలువురు ముఖ్య నాయ కులను రాష్ట్ర అధిష్టానం పిలిపించి బీబీ పాటిల్ నాయక త్వాన్ని బలపరచాలని.. భారీ మెజార్టీతో గెలిపించాలని సమ న్వయ సమావేశం ఏర్పాటు చేస్తే.. ఆ సమావేశంలో జైపాల్ రెడ్డి నిరసన వ్యక్తం చేసి అక్కడినుంచి వెళ్లిపోయినట్లు తెలిసి ంది. నాటి నుంచి బీజేపీ అధిష్టానానికి దూరంగా ఉంటున్నట్టు తెలుస్తోంది. దాంతో జైపాల్ రెడ్డి మళ్లీ ఘర్ వాపసి కాన ున్నాడని నియోజకవర్గంలో ఆయన అనుచరులు ప్రచారం చేస్తున్నారు. బిబి పాటిల్ నాయకత్వాన్ని పైడి ఎల్లారెడ్డితో పాటు మరో పలువురు ఆశావాహులు సహకరించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కానీ జైపాల్‌రెడ్డి వర్గం ఏ స్థాయిలో నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి మరి.



గీతంకు సీఐఐ మెగా ప్లాంటేషన్ అవార్డు

నవతెలంగాణ-పటాన్‌చెరు

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ప్రతిష్టాత్మక 'సీఐఐ మెగా ప్లాంటేషన్ అవార్డు'తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌ను సత్కరించింది. సీఐఐ తెలంగాణ రాష్ట్ర వార్షిక సమావేశం- 2023-24, సుస్థిర తెలంగాణ నిర్మాణంపై సదస్సు సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేయగా.. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ఈ అవార్డును అందుకున్నట్టు గురువారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. గీతం ప్రాంగణంలో గత ఏడాది సుమారుగా ఎనిమిది వేల మొక్కలను నాటి మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో చురుగ్గా పాల్గొన్నందుకు ఈ గుర్తింపు లభించినట్టు తెలిపారు. ఈ అవార్డును గత ఏడు ఏండ్లుగా గీతం అందుకుంటూ, పర్యా వరణ సుస్థిరత పట్ల తన నిబద్ధతను చాటి చెబుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు సహకరించడంలో విద్యార్థులు, సిబ్బంది అంకితభావంతో చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని డీవీవీఎస్ఆర్ వర్మ హర్షం వెలిబుచ్చారు.

మహిళల విద్యతోనే అన్ని విధాల అభివృద్ధి

నవతెలంగాణ-సంగారెడ్డి

మహిళల విద్యతోనే అన్ని విధాల అభివృద్ధి సాధ్యమని అదనపు కలెక్టర్ చంద్రశేకర్ అన్నారు. కలెక్టరేట్ ఆడిట ోరియంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురు వారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడు కల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. లింగ వివక్షత లేని సమాజం కోసం ప్రతీ ఒక్కరు పూనుకోవాలన్నారు. ఇంటి నుంచే మార్పు ప్రారం భం కావాలని, మగపిల్లలు, ఆడపిల్లలని వేరువేరుగా చూడ కుండా ఇద్దరిని సమానంగా చూడాలన్నారు. ముఖ్యంగా పిల్లల్లో మార్పు తీసుకురావాలన్నారు. సమాజంలో పూర్తిసా ్థయిలో లింగ వివక్షత రూపు మాయాలని, అప్పుడే నవసమా జానికి నాంది పలుకుతుందన్నారు. మహిళలు తలచుకుంటే ఏదైనా అవలీలగా చేయగలరని, అన్ని రంగాలలో రాణిస్తూ ముందుకు దూసుకు వెళ్తున్నారన్నారని అభినందించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీలు, ఇతర మహిళలు ఉద్యోగిణులు లింగ వివక్షత లేకుండా ఆడపిల్లను, మగ పిల్లాడిని సమానంగా చూడాలని, ఇద్దరికీ సమాన అవ కాశాలు కల్పించాలని అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మహిళలపై అరాచకాలు జరగకుండా ఎలా



నిరోధించవచ్చు, మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపా యాలు, కార్యక్రమాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు విద్య వైద్యం, వ్యాపార, రాజకీ యంగా, ఇతర అన్ని రంగాల్లో అన్నింటా ముందుండి ఉన్నత ంగా రాణించాలన్నారు. అమ్మాయిలు తాము ఎంచుకున్న రంగంలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న మహిళా అధికా రులను, ఉద్యోగులను, సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ, పద్మజ రాణి, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, డీఎంహెచ్ఓ గాయత్రీ దేవి, మెప్మ పీడీ గీత, పట్టణ టౌన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, సీడీపీ ఓల ు, అంగన్వాడీ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, 420 హామీలు అమలను వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ పట్టణ ంలోని హెచ్ఆర్ ఫంక్షన్ హాల్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన కార్యక ర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, 420 హామీలు అని చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించిందన్నారు. వారు అధికారంలోకి వచ్చి మూడు నెలలైనా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రాబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రజలతో మమేకమై ఘన విజయం సాధించేలాగా సైనికులై పనిచే యాలన్నారు. కాగా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడ ానికి బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తీసుకువస్తే.. ఆ ప్రాజెక్ట్‌ను, నాల్లవగు ప్రాజెక్ట్ సప్లిమెంటరీ ప్రాజెక్ట్‌ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ రద్దు చేసిందన్నారు. 1100 మందికి దళితబంధు రాకుండా చేశారని.. గృహలక్ష్మీ కింద 3000 ఇండ్లు మంజూరు చేస్తే వాటిని కూడా క్యాన్సిల్ చేశారని మండిపడ్డారు. తాడ్కల్ మండలం జీవో ముందే తెచ్చా మని.. దమ్ముంటే మంజూరు చేయాలన్నారు. ఆరోగ్య శ్రీ



కింద రూ.10 లక్షలు అమలు చేశామని గొప్పలు చెబుతు న్నారని.. కానీ ఏ దవాఖానకు వెళ్లిన డబ్బులు తీసుకుంటు న్నారన్నారు. 200 యూనిట్స్ లోపు ఫ్రీ కరెంటు కూడా అన్ని గ్రామాల్లో సగం మందికి మాత్రమే ఇచ్చారన్నారు. దళిత, గిరిజన బంధు కింద రూ.12 లక్షలు ఇస్తామని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని.. వెంటనే దాన్ని అమలు చేయా లన్నారు. ఈ కార్యకంలో నారాయణఖేడ్ నియోజక వర్గ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, టౌన్ ప్లానింగ్ అండ్ వార్డు ఇంచార్జ్‌లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ లు, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఏఎం సీ ఛైర్మెన్‌లు పాలకవర్గం, టాక్స్ ఛైర్మెన్‌లు అండ్ డైరెక్టర్ లు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పోచారంలో సీసీరోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-పుల్కల్

మండల పరిధిలోని పోచారం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 20 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు గ్రామాన్ని ఏమాత్రం పట్టిం చుకోకపోవడం దురదృష్టకరమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి తమ గ్రామాన్ని దత్తత తీసుకు న్నప్పటికీ.. అభివృద్ధిని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేశారన ్నారు. పోచారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి త్వరలోనే పాఠశాలలో సీసీరోడ్లుతోపాటు ప్రహరీ నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, పార్టీ గ్రామధ్యక్షులు మాణిక్యం శ్రీనివాస్‌రెడ్డి, దప్పు రాజు, మాజీ వార్డు సభ్యులు రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా బెల్టు షాపులు

- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- అనుమతులు లేకుండా సెట్టింగ్ రూములు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

నవతెలంగాణ-పుల్కల్

గ్రామీణ ప్రాంతాల్లో అడ్డగోలుగా బెల్టుషాపులు వెలుస్తున్నాయి. గల్లీకో దుకాణాన్ని ఏర్పాటు చేసి విచ్చల విడిగా మద్యాన్ని విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల ఏకంగా సిట్టింగ్ రూంలనే ఏర్పాటు చేసి యథేచ్ఛగా మద్యాన్ని విక్రయిస్తున్నారు. కొందరరు జాతీయ రహదారిపైనే దర్జాగా సిట్టింగ్ రూంలు ఏర్పాటు చేసుకుని దందా సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. ఎక్సైజ్ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అనేక గ్రామాల్లో మద్యం వ్యాపారులు అధికారుల అనుమతులు లేకుండా సెట్టింగులు ఏర్పాటు చేయడంతో తరచూ అక్కడ ఘర్షణలు జరుగుతున్నాయి ఈ విషయమై పలు సందర్భాల్లో పుల్కల్ పోలీసులు ఇరువురిని చెదరగొట్టి వారిపై కేసులు నమోదు చేసినప్పటికీ అయినా మాత్రం బెల్ట్ షాపు యజమాల్లో ఎలాంటి మార్పు రాకపోవడం దుర దృష్టకరం ఎవరైనా బెల్టు షాపులకు సమీపంలో వైన్స్ షాపుల నుండి మద్యాన్ని కాకుండా ఇతర ప్రాంతాల నుండి తెచ్చిన మద్యాన్ని విక్రయిస్తే ప్రైవేటు దుకాణ దారులపై దాడులు



చేస్తూ విద్యాసానికి దిగుతున్నారు ఈ విషయం తెలుసుకున్న ఎక్సైస్ శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు ఈ మధ్యనే పోచారం గ్రామంలో అక్రమ మద్యం తాగి ఒక్క వ్యవసాయ పోలి అక్కడే మృతి చెందాడు అయినా ఎవరు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమాజ సోమని ఆ గ్రామస్తులు కోరుతున్నారు ముఖ్యంగా

పుల్కల్, సింగూర్, చౌటకూర్, కోడూర్, గొంగుళూర్, ముద్దాయి పేట, మంతూర్, రాయపాడు, పెద్దారెడ్డి పేట, సుల్తాన్పూర్, కోర్పోల్, వెంకట కిష్టాపూర్, బొమ్మరెడ్డిగూడెం, లక్ష్మీసాగర్, ఎస్ ఇటిక్యాల, బుద్ధిమాణిక్యం తదితర గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంది. ప్రతీరోజు వేలల్లో వ్యాపారం జరుగుతున్నది. అయితే యథేచ్ఛగా మద్యం దొరు కుతుండడంతో చాలామంది నిత్యం తాగుతూ మద్యానికి బానిసలవుతున్నారు. కూలీ డబ్బులు మొత్తం మందుకే తగలేస్తున్నారు. దాంతో అనేక పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అంతేకాకుండా ఈ దుకాణాల వద్ద తరచూ ఘర్షణలు జరుగుతూ పలు వివాదాలకు దారి తీస్తున్నాయి. చాలాసార్లు ఈ ఘర్షణ జరిగినప్పుడు పోలీసులు జోక్యం కల్పించుకుని చెదరగొట్టిన సందర్భాలూ ఉన్నాయి. అంతేక ాకుండా ఇటీవలే పోచారం గ్రామంలో ఓ వ్యవసాయ కూలి కల్తీ మద్యం తాగి మృతి చెందాడు. అయినప్పటికీ బెల్టు షాప ులు మాత్రం యథేచ్ఛగానే నడుస్తున్నాయి. ఇంత జరుగు తున్న అబ్కారీ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ ాలను పొట్టనపెట్టుకుంటున్న మద్యం దుకాణాలను వెంటనే కట్టడి చేయాలని కోరుతున్నారు.

ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయాలు..

బెల్టు షాపుల్లో ఎమార్పీ అధికంగా మద్యాన్ని విక్రయ ిస్తున్నారు. పొద్దంతా కష్టపడితే వచ్చిన డబ్బును మొత్తం కొందరు ఈ బెల్టు షాపుల్లోనే పెడుతున్నారు. దాంతో కుటు ంబ పోషణ భారంగా మారుతున్నది. నిబంధనల ప్రకారం ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని విక్రయించాలని ఉన్నప్పటికీ.. అసలు ప్రభుత్వ అనుమతులే లేని.. ఈ బెల్టుషాపుల్లో అధిక ధరలకు మద్యాన్ని ఇష్టారీతిన విక్రయిస్తున్నారు.

అన్ని రంగాల్లో మహిళలకు సముచిత స్థానం లభించాలి



నవతెలంగాణ-జహీరాబాద్

అన్ని రంగాల్లో మహిళలకు సముచిత స్థానం లభించినప్పుడే ఆ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందు తుందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెంటర్ ఫర్ పీపుల్స్ గిరిజా దేవి అన్నారు. జహీరాబాద్ పట్టణంలో డీడీఎస్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ.. నేడు మహిళలు సాంకేతిక రంగంలో దూసుకుపోతున్నారని.. ఇది మంచి పరిణామ మన్నారు. అక్కడక్కడ కొన్ని సంఘటనలు జరగడంతో మహి ళలు మానసికంగా దెబ్బతిని అనుకున్న స్థాయిలో రాణించ లేకపోతున్నారన్నారు. ప్రభుత్వాలు మహిళలకు సముచిత స్థానం కల్పించడంతోపాటు రక్షణ కూడా కల్పించాలన్నారు. నేడు డీడీఎస్ సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక మాలు ఎంతో ఆదర్శప్రాయమన్నారు. నిరక్షరాసులైన మహి ళలు జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో వేదికలపైకి వెళ్లి మాట్లాడడం.. చిరుధాన్యాల గురించి వివరించడం, వాటి ఉత్పత్తుల గురించి లభించే పోషక విలువల గురించి తెలి యపరచడం లాంటి కార్యక్రమాలు చూస్తుంటే ఈ మహిళలు నిరక్షరాస్య శాస్త్రవేత్తల్లాగా కనిపిస్తున్నారన్నారు. వారిని ఈ స్థాయికి తీసుకువచ్చేందుకు డీడీఎస్ సంస్థ చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. ఇకముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని పిలుపుని చ్చారు. డీడీఎస్ సభ్యురాలు సుధా గోపరాజు, సఖి సెంటర్ నిర్వాహకురాలు హరితలు మాట్లాడుతూ.. ఐక్యమత్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తే విజయాలు సాధిస్తామన్నారు. నేడు డీడీఎస్ మహిళా సంఘం సభ్యులు పాత పంటల గురించి, మహిళా హక్కుల సాధన కోసం చేస్తున్న కృషి ఎంతో అభినం దనీయమన్నారు. అనంతరం జహీరాబాద్ పట్టణంలోని కు మార్ హెూటల్ నుంచి కేఫ్ ఎత్నిక్ హెూటల్ వరకు మహ ిళలు ర్యాలీ నిర్వహించారు. తదనంతరం పస్తాపూర్‌లో గల డీడీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సభలో వక్తలు మాట్లాడి.. ఉత్తమ రైతులకు వివిధ రంగాల్లో రాణ ిస్తున్న మహిళలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డీడీ ఎస్ సంఘం సభ్యులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మహిళలు మార్గదర్శకులు

నవతెలంగాణ-జిన్నారం

మహిళలు మార్గదర్శకులని జిన్నారం ఎంపీపీ దమ్మ గౌని రవీందర్ గౌడ్ అభివర్ణించారు. జిన్నారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం నిర్వహిం చిన మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ఉద్యోగులకు, స్థానిక మహిళలకు రంగవల్లికలతో పాటు వివిధ రకాల పోటీ కార్యక్రమాలు ఎంపీడీవో అరుణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వ హించి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాట ుచేసిన కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ గౌడ్ మాట్లా డుతూ.. నేడు అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉండడం సంతోషంగా ఉందన్నారు. స్వశక్తితో నేడు మహి ళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఎంపీడీవో అరుణ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవ వేడుకలు ఆనంద భరితంగా జరుపుకోవడం సంతోషంగా ఉందంటూ ఎంపీపీ రవీంద్రగౌడ్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు నేడు వివిధ రంగాల్లో చైతన్యపూరితంగా ముందుకు వస్తూ



అవకాశాలను సృష్టించడం, అద్భుతాలను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. మల్ల దినోత్సవ వేడుకల సంద ర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో విజేతలకు బహుమ తులు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సీ డాక్టర్ కోమల్ తారక్, గడ్డపోతారం ఎంపీటీసీ జనాభాయి, జిన్నారం ఎంపిటిసి కోర బోయిన లావణ్య నరేష్,ఐకేపీ ఏపీ ఎం నరేందర్, జిన్నారం మండల యువజన కాంగ్రెస్ అధ్య క్షులు నరేందర్, ఎర్రవాలి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ సూచించారు. న్యాల్కల్ మండల కేంద్రంలోని సాయిబాబా మందిర ఆలయంలో బీజేపీ శక్తి కేంద్రం ఇంచార్జ్ గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ గెలుపు కోసం



నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరన్న కాశీనాథ్ పాటిల్, రాహుల్, రాము, వాసు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన తాడెం వెంగల్ రావు



నవతెలంగాణ-చేగుంట

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేసి తీరుతుందని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. చేగుంట మండలం మక్క రాజుపేట రోడ్‌లో ఉన్న బాలాజీ ఫంక్షన్ హాల్లో గురువారం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు వెంగాల్ రావుతో పాటు 300 మంది నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి మైనంపల్లి హనుమంతరావు ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, దుబ్బాక ఇంఛార్జి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ అల్లి రామ, మాజీ సర్పంచులు అంజా గౌడ్, జగన్ గౌడ్, వెంకట స్వామి, మాజీ ఉప సర్పంచ్ గౌస్ జాని, మైనారిటీ సీనియర్ నాయకులు సాబేర్ హుసేన్, నదీమ్, మాజీ ఎంపీటీసీ బాలయ్యలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్, సీనియర్ నాయకులు భూమా లింగం గౌడ్, కాశ బోయిన భాస్కర్, సాయి కుమార్ గౌడ్, శ్రీకాంత్, అగం, స్టాలిన్, రాజా గౌడ్, అంజి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్



నవతెలంగాణ-టేక్మాల్ : ప్రజల పక్షాన ఉండి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గురువారం టేక్మాల్ మండల పరిధిలోని చంద్రుతాండ, ఎలకుర్తి ఎంపీటీసీ లకావత్ మోహన్ గృహప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సాధించేంతవరకు అలుపెరుగని పోరాటం చేసి సాధించిన తర్వాత సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజల తరపున పోరాటం చేస్తూ ప్రజా గొంతుకలాగా ఉంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబట్టుకోలేకపోతే ప్రజల ముందు దోషులుగా నిలబెడతామని హెచ్చరించారు. కార్యకర్తలు అధైర్య పడవద్దు అని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప ప్రధాన కార్యదర్శి అవినాష్, మాజీ ఎంపీటీసీ సిద్దన్న, ఎంపీపీ చింత స్వప్న రవి, మాజీ సర్పంచ్ వరలక్ష్మి, టేక్మాల్ సర్పంచ్ ప్రజా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మనసున్న మహారాజు మహేష్ అన్న



నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం పరితపిస్తున్న ప్రజా ప్రతినిధి
నేడు మహేష్ అన్న జన్మదిన వేడుకలు
భారీ ఏర్పాట్లు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు మహేష్ అన్న అభిమానులు

నవ తెలంగాణ-నర్సాపూర్

మనసున్న మహారాజు శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం పరితపిస్తూ ముందుకు సాగుతున్నాడు. మండలంలో ఎవరైనా ఆపదలో ఉన్నారని ఆయనకు తెలిస్తే చాలు క్షణం ఆలోచించకుండా ఆపదలో ఉన్న వారి ఇంటికి చేరుకొని ఆర్థిక సాయం చేసి అండగా నేనున్నానంటూ ఆపదలో ఉన్నవారికి భరోసా ఇస్తాడు. తన సొంత డబ్బులతో అనేక గ్రామాలలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడం, మంచినీటి సమస్య తీర్చేందుకు బోర్లు వేయించడం వంటి కార్యక్రమాలు ఇప్పటికీ ఎన్నో చేశాడు. శివంపేట మండలంలో పబ్బ మహేష్ గుప్తా సహాయం చేయని గ్రామం అంటూ ఉండదు. ప్రతి గ్రామానికి ఏదో ఒక రూపంలో సహాయం అందిస్తూ పబ్బ మహేష్ గుప్తా అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుత రాజకీయాల్లో ఓట్ల సమయంలో మాత్రమే వచ్చే నాయకులు మనకు కనిపిస్తారు తప్ప ఇతర సమయాల్లో కనిపించని ఎంతోమంది ఉంటారు. అయితే జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా మాత్రం నిత్యం ఓటు వేసి తనను జడ్పీటీసీగా గెలిపించిన మండల ప్రజల కోసం సేవ చేస్తూ వస్తున్నాడు. ఆయన సంపదలో సగం ప్రజా సేవా కార్యక్రమాలకే ఖర్చు చేస్తున్నాడు. రాష్ట్రంలోనే ఉన్న జడ్పీటీసీలలో పబ్బ మహేష్ గుప్త మాత్రం ప్రజలకు సేవ చేయడంలో ఆదర్శంగా నిలుస్తున్నాడు. అటువంటి మనసున్న మహారాజు మహేష్ అన్న జన్మదిన వేడుకలు శుక్రవారం శివంపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, మహేష్ గుప్తా అభిమానులు భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బీఎస్పీ బీఆర్ఎస్ పొత్తు అనైతికం



నవతెలంగాణ-నిజాంపేట

బీఎస్పీ బీఆర్ఎస్ పొత్తు అనైతికమని నిజాంపేట మాల మహానాడు మండల అధ్యక్షుడు బండారి చంద్రయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గతంలో దొరల తెలంగాణ వద్దు బహుజన రాజ్యాధికారం కావాలని బీఎస్పీ అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారని, మరి బీఆర్ఎస్‌తో ఏ విధంగా పొత్తు కుదుర్చుకున్నారో అర్థం కావడం లేదన్నారు. కేసీఆర్ మాయలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పడిపోయారని ప్రతిసారి కేసీఆర్ దళితుల పేరు చెప్పి దళితుల ఓట్లను దండుకోవడానికి కొత్తగా వ్యూహాలు పన్నుతున్నారన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మొట్టమొదటిగా దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ తానే ముఖ్యమంత్రి అయ్యాడని విమర్శించారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని బహుజనుల తెలంగాణ కావాలని బహుజనుల కోసమే బీఎస్పీలో చేరానని గతంలో పలుమార్లు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పడం జరిగిందన్నారు. మరి కేసీఆర్‌తో ఎందుకు పొత్తు కుదుర్చుకున్నాడో అర్థం కావడం లేదన్నారు. కేసీఆర్ మోసాలను గమనించే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని ఇప్పటికైనా బీఎస్పీ నాయకులు గమనించాలన్నారు. బహుజనులందరూ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని పార్లమెంటు ఎన్నికలలో 15 ఎంపీస్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. ఇప్పటికైనా బహుజనులందరూ మేల్కొని బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-చేగుంట

ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన చేగుంట విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అయిత చంద్రమౌళిని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గురువారం పరామర్శించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంగా త్వరగా కోలుకోవాలని హనుమంతరావు అన్నారు. హనుమంతరావు వెంట సర్పంచ్‌ల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడెం మహిపాల్ రెడ్డి, శంకరంపేట ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి గోపాల్ రెడ్డి, తూప్రాన్ ఎంపీపీ, మేడి గణేష్, తోడుపునూరు నగేష్, అయితే పరంజ్యోతి, ఎంపిటిసి అయితే వెంకటలక్ష్మి రఘురాములు, వంజరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లోనే మహిళ ప్రసవం

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

ఓ మహిళ 108 అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగిన సంఘటన మండల పరిధిలోని వాడి తండాలో గురువారం చోటు చేసుకుంది. వాడి తండాకు చెందిన మూడవత్ శోభ నిండు గర్భిణి. మధ్యాహ్నం శోభకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని శోభను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించే సమయంలో ఆమెకు నొప్పులు ఎక్కువ కావడంతో శోభకు ఈఎంటీ శ్రీహరి నార్మల్ డెలివరీ చేశారు. అనంతరం వారిని మెదక్ మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని ఆరోగ్య సిబ్బంది తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు కేకును కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చేగుంట మండల నోడల్ ఆఫీసర్ నీరజ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళలకు ఆర్థిక సమానత్వంతోనే సమ సమాజం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లలిత, రాధ, శారదా, సరస్వతి, రమ, శ్రీ వాణి, భవాని, సుమతి తదితరులు పాల్గొన్నారు.

వీగిపోయిన మున్సిపల్ అవిశ్వాసం

నవ తెలంగాణ-సంగారెడ్డి : సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి పై సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లు గత నెల అవిశ్వాసం ప్రకటిస్తూ 24 మంది సంతకాలతో కూడిన లిస్టును అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కు లేఖనందించిన విషయం తెలిసిందే ఇందుకు సంబంధించి అదనపు కలెక్టర్ మార్చి ఏడవ తేదీన తమ బలం నిరూపించుకోవాలని అవకాశాన్ని కల్పించారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు ఇది ఇలా ఉంటే ఇరుపక్షాల కౌన్సిలర్లు ఎవరికి వారు తాము మద్దతు తెలిపే నేతలతో కలిసి విహారయాత్రలకు వెళ్లారు మార్చి 7 గురువారం సంగారెడ్డి ఆర్డిఓ వసంత కుమారి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్లు ఇచ్చిన సమయానికి సంగారెడ్డి మున్సిపల్ సమావేశ మందిరంలో వేచి చూశారు ఒక్కరు కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో సాయంత్రం మూడు గంటలకు సమావేశాన్ని వాయిదా వేసి వెళ్లిపోయారు అనంతరం సాయంత్రం మూడు గంటలకి తిరిగి ఆర్డీవో వసంతకుమారి మున్సిపల్ కమిషనర్లు సమావేశ మందిరంలో అర్ధగంట పాటు వేచి చూశారు కౌన్సిలర్ లు ఎవరు సమావేశం మందిరానికి రాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటించారు.

అవిశ్వాసం వీగిపోయిన ప్రజా సమస్యలపై పోరాటం ఆగదు

అవిశ్వాసం ప్రకటించిన 27వ వార్డు కౌన్సిలర్ మంజులత భర్త బి ఆర్ ఎస్ నాయకులు నక్క నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు మున్సిపల్ కు చేరుకొని పాత్రికేయ మిత్రులతో మాట్లాడుతూ తాము అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్లకు నోటీసులు ఇచ్చిన మాట వాస్తవమేనని కానీ తమకు మద్దతు తెలిపిన 24 మందిలో కొందరు కౌన్సిలర్లు తమ సొంత ప్రయోజనాలకు లొంగిపోయి సమావేశానికి హాజరు కాలేదని తమకు 26 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం ఉండగా 15 మంది మాత్రమే తమతో ఉన్నారని కాబట్టి సమావేశాలకు హాజరు కాలేకపోతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ లతా భర్త అయిన విజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి ప్రజా సమస్యలపై ఎప్పుడు పట్టనట్టుగానే వ్యవహరించారని ఆరోపణలు చేశారు సంగారెడ్డికి ప్రధాన సమస్య అయిన డంప్యార్డ్ వ్యవహారంలో ఎన్నిసార్లు మున్సిపల్ చైర్ పర్సన్ దృష్టికి తీసుకువచ్చిన స్పందించలేదన్నారు, నిధుల కేటాయింపులను కౌన్సిలర్లకు సహకరించకపోవడంతో అవిశ్వాసం పెట్టడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కేవలం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వల్లే జరిగిందని అన్నారు కొందరు కౌన్సిలర్లు గత సంవత్సరం నుండి అవిశ్వాసం పెడదామంటూ చెప్పిన కౌన్సిలర్లే ఇప్పుడు గైర్హాజరవడం చింతించదగ్గ విషయమన్నారు. అవిశ్వాసం వీగిపోయిన ఇంకా 10 నెలల సమయం ఉందని నిరంతరం సంగారెడ్డి ప్రజల తరఫున వారి సమస్యలపై పోరాడుతూనే ఉంటామని తెలిపారు ఈ సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు నక్క నాగరాజు గౌడ్ విట్టల్, జలంధర్, జీవి కౌన్సిలర్ లు రామప్ప, పవన్, శ్రీకాంత్, విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు

నేడే ఏడుపాయల మహా జాతర


జాతరను ప్రారంభించనున్న మంత్రి స్థానిక ఎమ్మెల్యే

నవతెలంగాణ-పాపన్నపేట

తెలంగాణాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గామాత మహా జాతర నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఏడుపాయల ముస్తాబైంది. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి జాతరను ప్రారంభిస్తారు. వెలసిన దుర్గామాతను దర్శించుకునేందుకు లక్షలాది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ఏడుపాయలలో ప్రవహించే మంజీరా పరవళ్లు, పక్షుల కిలకిల రాగాలు, కనువిందు చేసే రాతి గుహల్లో వెలసిన దేవి భక్తులను కొలిచే కొంగు బంగారు తల్లిగా పేరొందారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావులు ఉత్సవాలను



ప్రారంభించనున్నారు. దాదాపు 10 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రానున్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లా యంత్రాంగం ఏడుపాయలకు చేరుకోగానే ఏడుపాయల్లో జాతర వాతావరణం నెలకొంది. జాతరలో 23 శాఖలు పనిచేస్తున్నాయి. రెవెన్యూశాఖ, పోలీసు, ఫైర్, అటవీశాఖ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, నీటి పారుదల శాఖ, పంచాయతీ శాఖలతో పాటు ఆయా శాఖల అధికారులు జాతర పనుల్లో నిమగ్నమయ్యారు. జాతరలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకుగాను సింగూరు ప్రాజెక్టు నుంచి 0.025 టిఎంసిల నీటిని వన దుర్గా ప్రాజెక్టుకు విడుదల చేశారు. ఈ పాటికే నీటి పారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేయటంతో మంజీరా డ్యాం పొంగిపొర్లుతుంది. 6 చోట్ల స్నానాల కోసం శవర్‌లు, బాత్ రూంలు ఏర్పాటు చేయడంతోపాటు మహిళలు బట్టలు మార్చుకోవడానికి గుడారాలు ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఆధ్వర్యంలో 1100 మంది పారిశుద్ధ్య సిబ్బంది 600 మంది ఎంపీడబ్ల్యుఓ, 250 మంది ప్రైవేటు కార్మికులు, 250 మంది పంచాయతీ కార్యదర్శులు, 15మంది ఎంపిఓలు 3డి ఎల్పీఒల ఆధ్వర్యంలో సిబ్బంది పని చేస్తారన్నారు. జాతరలో పాపన్నపేట, పొడిచన్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఏడుపాయల జాతరకు వచ్చే భక్తులకు మెదక్ ఎస్పీ బాల స్వామీ, మెదక్ డీఎస్పీ, మెదక్ రూరల్ సిఐ కేశవుల ఆధ్వర్యంలో పాపన్నపేట ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో 1100 మంది పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారన్నారు. ఏడు పాయల మహాశివరాత్రి జాతరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు కల్పించేందుకు గాను భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ ఎస్.బాలాగౌడ్, ఈఓ పి.మోహన్ రెడ్డిలు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులతో ఏడుపాయల జాతరను విజయవంతం చేయాలని వారు కోరారు.



తెలంగాణలోనే ప్రసిద్ధి గాంచినఏడుపాయలలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు పెద్ద ఎత్తున జాతర జరగనుంది. ఈ జాతరకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తదితర రాష్ట్రాల నుంచి సుమారు పది లక్షల మంది వరకు భక్తులు వస్తుంటారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఏడుపాయలకు వచ్చే భక్తులు మొదటి రోజు అంటే ఈ నెల ఎనిమిదో తేదీన మహాశివరాత్రిని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపడతారు. రెండవ రోజు ఈ నెల 9న జాతరలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బండ్లు తిరిగే కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా సుమారు 100 బండ్లకు పైగా జాతరలో తిరుగుతాయి. ఇందులో పాపన్నపేట సంస్థానాదిశుల బండి ముందు వరుసలో తిరుగుతుండగా మిగతా బండ్లు దీనిని అనుసరిస్తాయి. జాతరలోనే ఈ కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తారు. జాతర జరిగే మూడు రోజుల్లో ఈ రోజునే లక్షలాదిమంది భక్తులు తరలి వస్తారు. మొదటి రోజున ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులకు తోడు రెండవ రోజైన బండ్లు తిరిగే రోజు ఏడుపాయలకు చేరుకున్న భక్తులు తెలంగాణ సాంస్కృతి ఆచారాలలో భాగంగా మాంసాహారాలతో విందులు వినోదాలతో గడపడానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు. మూడో రోజున అంటే జాతర చివరి రోజైన పదో తేదీన రాత్రి రథోత్సవ కార్యక్రమం చేపడతారు ఈ రోజు సైతం సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు వస్తారు. మూడవ రోజుతో జాతర ముగుస్తుంది.

ఏడుపాయల స్థల పురాణం...

ఏడుపాయల తెలంగాణలోనే అత్యంత ప్రసిద్ధమైన దేవాలయాలం. ఇది టూరిజం ఫెస్టివల్‌గా ప్రభుత్వం గుర్తించింది. పచ్చని చెట్లు గుట్టలు రాళ్లతో నెలకొని ఉన్న ప్రాంతంలో మంజీర నది ఏడుపాయలుగా విడిపోగా మధ్యలో ఏర్పడిన గుహలో అమ్మవారు స్వయంభుగా అవతరించారు. శ్రీ వేద వ్యాస వశిష్ట వాల్మీకి శౌనక బృందాది మహర్షుల నివాసయోగ్యమైన నైమి శరణ్యం పోలిన గొప్ప దండకారణ్యం ద్వాపర యుగంలో అర్జునుడి కుమారుడు అయిన పరీక్షిత్తు అక్కడికి వెళ్లగా తపోవు ధ్యానంలో నిమగ్నమై ఒక ముని కనబడ్డాడు. పరీక్షిత్తు రాజు దాహం తీర్చమని ఆ మునిని కోరగా కఠోర తపస్సులో ఉన్న ముని గమనించలేదు. పరీక్షిత్తు మహారాజు ముని మెడలో పాము వేసి తన రాజ్యానికి తిరిగి వెళ్ళిపోయాడు. కొంతసేపటికి కళ్ళు తెరిచిన ముని తన మెడలో చనిపోయి ఉన్న పామును గమనించి ఆ తుంటరి పని చేసిన వారు పాముకాటుతోనే మరణిస్తారని శపించినాడు. ఆ శాపం వలన పరీక్షిత్తు మహారాజు పాము కాటుతోనే మరణించాడు. అనంతర కాలంలో పరీక్షిత్తు మహారాజు కుమారుడు జనమేజయుడు తన తండ్రిని చంపిన పాములపై పగ తీర్చుకోవడానికి సర్పయాగం చేసినాడు సర్పజాతి పితామహుడు ఆ సర్పయాగం ఆపడానికి వాసుకి కోరిక మేరకు వన దుర్గ భవాని స్వయంభుగా వెలిసి మంజీరా (గరుడ గంగా) నదిని అమ్మవారి పాదాలతో స్పృశించగా ఏడుపాయలుగా చీలి యాగం నుంచి వచ్చే అగ్ని జ్వాలలను చల్లార్చి సర్పజాతి వినాశనం కాకుండా కాపాడారు. ఈ నాటికి ఇక్కడికి గుహలలో తవ్వినప్పుడు గతంలో యాగం చేసిన బూడిద (భస్మం) లభ్యమవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఏడుపాయల జాతరకు ఎలా వెళ్లాలి

బీదర్, నారాయణఖేడ్, జహీరాబాద్, బుడిమట్టపల్లి తదితర ప్రాంతాల నుంచి ఏడుపాయల జాతరకు వెళ్లాలంటే ఏడుపాయల కమాన్ మీదుగా జాతరలోకి వెళ్లాల్సి ఉంటుంది. ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర ప్రైవేట్ వాహనాలపై ఈ రహదారి నుంచి వెళ్ళవచ్చు. కానీ ఏడుపాయలలోని



చేలిమేల కుంట వద్ద గల పోలీస్ చెక్‌పోస్టు వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు. అక్కడే వాహనాలను ఆపి కిలోమీటర్ మేర నడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఇక హైదరాబాద్, సికింద్రాబాద్, బాలానగర్ నర్సాపూర్, సంగారెడ్డి, జోగిపేట ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పోతాన్ శెట్టిపల్లి వైపు నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు గుండా ఏడుపాయల జాతరలోకి వెళ్లొచ్చు. వీరు ఏడుపాయలలోని రెండవ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో తమ తమ వాహనాలను ఆపి జాతరలోకి వెళ్లాల్సి ఉంటుంది. అయితే వృద్ధులు వికలాంగులు చిన్నపిల్లలు వెళ్లడానికి ఏడుపాయల దేవస్థానం వారు 8 మినీ బస్సులను రెండు ప్రాంతాల పార్కింగ్ స్థలాల నుంచి తిప్పుతున్నారు. వీరు వీటిని వినియోగించుకునే అవకాశం ఉంది.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన చైర్మెన్ బాలాగౌడ్



జాతర ఏర్పాట్లకు రెండు కోట్లు మంజూరు చేయడం పట్ల మెదక్ ఎమ్మెల్యేకు చైర్మన్ బాలా గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఏడుపాయల జాతరకు లక్షలాదిమంది భక్తులు తరలి రానున్న నేపథ్యంలో ప్రతి ఏడు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తుంటారు. ఇందులో భాగంగా ఇటీవల మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్ అదనపు కలెక్టర్లు రమేష్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పలుమార్లు మెదక్ కలెక్టరేట్‌తో పాటు ఏడుపాయలలో జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విఐపి క్యూ లైన్‌ల భారీకేడ్లు, జనరల్ క్యూ లైన్‌ల బారికేడ్లతో పాటు, షవర్లు దుస్తులు మార్చుకునే గదులు, మంచినీటి కుళాయిలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్మికుల నియామకంతో పాటు నీటి ప్రమాదాలు జరగకుండా పెద్ద ఎత్తున గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాల్సిందిగా ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రావ్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

తొటి వారి సూటిపోటీ మాటలకు చదువుతోనే సమాధానం

నవ తెలంగాణ-టేక్మాల్

నలుగురు ఆడపిల్లలే..ఎలా పెంచుతారు...ఎలా పెళ్లిళ్లు చేస్తారు.... అంటూ ఇరుగుపొరుగు వారు చేసే సూటిపోటీ మాటలకు తమ బిడ్డలను బాగా చదివించి ప్రభుత్వ ఉద్యోగులుగా చేసి అందరికి ఆదర్శంగా నిలిచార ఆ దంపతులు. టేక్మాల్ మండల పరిధిలోని పాల్వంచ గ్రామానికి చెందిన కంది దుర్గయ్య మానెమ్మ దంపతులకు నలుగురు ఆడపిల్లలే. చుట్టుపక్కల వారికి చదువుతోనే సమాధానం చెప్పాలని ఆ దంపతులు మొదటి నుంచి పిల్లలను బాగా కష్టపడి చదివించేవారు. ఇంటికి పెద్ద అమ్మాయిని చిన్నతనంలో పెళ్లి చేయడంతో ముగ్గురు పిల్లలను పెంచే బాధ్యత మానెమ్మ తీసుకుంది. రెండవ కూతురు సులోచనను రెసిడెన్షియల్ హాస్టల్‌లో వేసి బాగా చదివించింది. ఫలితంగా టీచరు ఉద్యోగాన్ని సంపాదించింది. మూడవ అమ్మాయి సబిత ఇంటి దగ్గరనే ఉండి చదువుకునేది. హెల్త్ డిపార్మెంట్లో ఉద్యోగం సంపాదించింది. నాల్గవ అమ్మాయి ఉజ్వల కూడా రెసిడెన్షియల్ హాస్టల్లో చదివి టీచర్ ఉద్యోగం పొందింది. ఆడపిల్లలను పెంచి పోషించలేని నేటి తరుణంలో, ముగ్గురు పిల్లలను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత తనను తలెత్తుకునేలా చేసిందని దుర్గయ్య మానెమ్మ దంపతులు ఆనందం వెలిబుచ్చుతున్నారు.

జాగ్రత్తలు చెబుతూ చదివించేది

చౌటకూర్ మండల్ పోసానిపేట్ టీచర్ సులోచన



నాన్న కూలి పనికి వెళుంటే అమ్మ జాగ్రత్తలు చెబుతూ తమను చదివించేది. మీరు బాగా కష్టపడి చదివితే మేము ఊర్లో తలెత్తుకొని బతుకుతాం అని అన్న ఆ మాటలే జీవితంలో గుణపాఠాలుగా నేర్చుకొని జీవితంలో ఏదో సాధించాలని టీచర్ ఉద్యోగాన్ని సాధించానన్నారు

చదువుతోనే గుణపాఠం చెప్పాం

టేక్మాల్ పిహెచ్‌సి ఉద్యోగి సబిత



ఊళ్లో అందరూ నలుగురు ఆడపిల్లలే మీ అమ్మ నాన్న పెళ్లిళ్లు ఏం చేస్తారు అని హేళనగా మాట్లాడే వారన్నారు వాళ్ళందరికీ మా చదువుతూనే గుణపాఠం చెప్పామన్నారు

సొదరీలను ఆదర్శంగా తీసుకున్న

రాయికోడ్ మండల్ టీచర్ ఉజ్వల



అమ్మ నాన్నల కష్టాలు చూసి అక్కచెప్పే పాఠాలు వింటూ గుణపాఠంగా నేర్చుకుంటూ వారిద్దరిని ఆదర్శంగా తీసుకుంటూ కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించాను. టీచర్‌గా ఆనందంగా ఉంది.

మినీ స్టేడియం ఏర్పాటుకు 7 ఎకరాల స్థలం

తహశీల్దార్ కమలాద్రి



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటు కోసం 731 సర్వేనెంబర్ భూమిలో గల ఏడు ఎకరాల స్థలాన్ని జిల్లా క్రీడా యువజన శాఖకు అప్పగించడం జరిగిందని తహశీల్దార్ కమలాద్రి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మినీ స్టేడియం ఏర్పాటు కోసం ఏడెకరాల స్థలం అవసరమని నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారన్నారు. ఇది పరిశీలించిన జిల్లా కలెక్టర్ నర్సాపూర్ శివారులో గల 731 ప్రభుత్వ భూమిలో ఏడెకరాల స్థలం కేటాయించాలని, అందుకోసం చర్యలు తీసుకోవాలని తమకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అట్టి స్థలాన్ని పంచనామ చేసి జిల్లా క్రీడల యువజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగరాజుకు భూమికి సంబంధించిన పత్రాలను అప్పగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య మహిళా ద్వారా రెండు క్యాన్సర్ కేసులు నమోదు

పీహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎంహెచ్‌ఓ చందు నాయక్

నవతెలంగాణ-కౌడిపల్లి



ఆరోగ్య మహిళా ద్వారానే మెదక్ జిల్లాలో రెండు క్యాన్సర్ కేసులు నమోదయ్యాయని డీఎంహెచ్ ఓ చందు నాయక్ పేర్కొన్నారు. గురువారం కౌడిపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించి, ఇతర సమస్యలపై సరైన వైద్యం అందుతుందా, మందులు ఇస్తున్నారా అంటూ రోగులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 7500 మంది రోగులు రాగా వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించగా ఇద్దరికీ క్యాన్సర్ వచ్చినట్లు నిర్ధారణ జరిగిందన్నారు. క్యాన్సర్ సోకిన వారికి హైదరాబాద్ క్యాన్సర్ ఆస్పత్రికి తరలించి సరైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన రోగులకు మహిళా డాక్టర్లను ఏర్పాటు చేసి సరైన జాగ్రత్తలు తీసుకుంటూ వైద్యం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా గొంతు, లివర్, రొమ్ము క్యాన్సర్లు ఎక్కువగా వస్తున్నాయి అన్నారు. వీరికి ఒక గది ఏర్పాటు చేసి మహిళా డాక్టర్‌ను ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకుంటూ వైద్యం చేస్తున్నామన్నారు. శుక్రవారం ఉమెన్స్‌డే సందర్భంగా జిల్లాలో మంగళ, గురువారాల్లో మహిళా క్లినిక్ సెంటర్‌ల ద్వారా వైద్యం అందజేస్తున్నామన్నారు. జిల్లాలో పది మహిళా క్లినిక్‌లు ఉన్నాయని ఆయన తెలిపారు. కౌడిపల్లిలో ఏర్పాటు చేసిన మహిళా క్లినిక్‌ను పరిశీలించారు. డాక్టర్ ఫర్నాజ్, శ్రీధర్ రెడ్డి, ఎంపీహెచ్‌ఓ సురేందర్ ఏఎన్ఎం మజీద బేగం రోగులు ఉన్నారు.

సదాశివపల్లి పాఠశాలలో స్వయం పరిపాలన

హాజరైన స్పెషల్ ఆఫీసర్ డిఈ అమరేశ్వర్

నవ తెలంగాణ-కౌడిపల్లి



విద్యార్థులే దేశానికి పునాదులని, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్పెషల్ ఆఫీసర్ పంచాయతీరాజ్ డిప్యూటీ డిఈ అమరేశ్వర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సదాశివపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరేశ్వర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పాఠశాలలలో నిర్వహించే స్వయం పాలన ద్వారా విద్యార్థులకు కొత్త ఉత్తేజంతోపాటు బాధ్యతలు తెలుస్తాయన్నారు. విద్యార్థులు చక్కగా చదివి తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలన్నారు. ఈ స్వయం పాలనలో విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఇందులో భాగంగా ప్రధాన ఉపాధ్యాయురాలుగా నిహారిక, ఎంఈఓగా వెంకటేష్, ఉపాధ్యాయులుగా మనోజ్, వికాస్, చరణ్ తేజ భానుప్రియ, సాయి కీర్తన, దీపిక, సాయి గణేష్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అతిథులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ పాంద్ర నర్సింగ్ రావు, మాజీ సర్పంచ్ బోయిని వీరయ్య, పిఆర్ ఏఈ ప్రభాకర్, కౌడిపల్లి మాజీ సర్పంచ్ శివాంజనేయులు, పెద్దలు బోయిని జనార్దన్, అమర్ సింగ్, ఎస్ఎంసి మాజీ చైర్మన్ గోవిందపల్లి శ్రీనివాస్, పాఠశాల పంచాయతీ సెక్రెటరీ రేణుక, ప్రధానోపాధ్యాయులు మెట్టు రాములు శర్మ, ఉపాధ్యాయ బృందం యాదగిరి, లావణ్య, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ-చేగుంట

ఉమ్మడి చేగుంట మండలం పోతన్‌పల్లి గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ వారు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 122 మందికి షుగర్, బీపీ, టెస్టులు చేశారు. ఆపరేషన్ అవసరమున్న 52 మందిని మెడిసిటీ హాస్పిటల్‌కు తరలించి ఉచిత ఆపరేషన్లు చేయడం జరుగుతుంది. ఈ శిబిరంలో డాక్టర్లు వినయ్, సుచిత్ర, కావ్య, కృష్ణ మార్కెటింగ్ ఇంచార్జ్ కుమారస్వామి, నాగార్జున, సత్య నారాయణ, సౌమ్యలు పాల్గొన్నారు.

మహిళలు బాగుంటేనే... దేశం బాగుంటుంది



మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

నవ తెలంగాణ - సిద్దిపేట : మహిళలు బాగుంటేనే దేశం బాగుంటుందని, మహిళలు తమ ఆరోగ్యం కోసం రోజులో ఒక గంట నైనా సమయం కేటాయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి తెలిపారు. గురువారం ఆమె నవతెలంగాణ తో మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ముందస్తుగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆర్థికంగా మహిళలు ఎదిగిన నాడే సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెరుగుతుందని, మగ, ఆడ తేడా లేకుండా అన్ని రంగాలలో మహిళలు రాణించాలని అన్నారు. ముఖ్యంగా చదువు మహిళలకు చాలా అవసరమని, సమాజంలో ఏ విధంగా ఉండాలో నేర్పిస్తుందని అన్నారు. ప్రతి విషయానికి మహిళలు భయపడకూడదని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. మానసికంగా కృంగిపోకుండా ఆత్మస్థైర్యం కలిగి ఉండాలన్నారు. తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. రాజకీయంగా, సామాజికంగా మహిళలు ఎదగాలని, అందుకు మహిళలు ముందుకు రావాలన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే తన కుటుంబాన్ని బాగా చూసుకుంటుందని, కుటుంబాలు బాగుంటే దేశం బాగుంటుందని, అందుకోసం రోజుకు ఒక గంట నైనా తనకోసం కేటాయించుకోవాలని అన్నారు. తనకు నచ్చిన రంగాన్ని తెలుసుకొని ఎదగాలన్నారు. మరోసారి మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

వంటిమామిడి ఏఎంసీ చైర్మన్ తమ కుటుంబ సభ్యులకు ఇవ్వాలి



నవతెలంగాణ-ములుగు

వంటిమామిడి ఏఎంసీ చైర్మన్ తమ కుటుంబ సభ్యులకు ఇవ్వాలని మాజీ పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఎడ్లపోచయ్య అన్నారు. ఎడ్ల పోచయ్య 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ తనకు ఊహ తెలిసినప్పటి నుంచి కాంగ్రెస్‌లోనే ఉన్నానన్నారు. కాంగ్రెస్ కోసమే పని చేశానని తెలిపారు. ఒకసారి పిఎసిఎస్ వైస్ చైర్మన్ అయ్యాను. ముంపు గ్రామంలో ప్రతిపక్షంలో ఉండి ఎంతో ఇబ్బంది ఎదుర్కొన్నాను. కాబట్టి వంటిమామిడి మార్కెట్ చైర్మన్ పదవిని తమ కుటుంబ సభ్యులకే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్ కి, మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం ఇచ్చానని తెలిపారు.

మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట నియోజకవర్గ వర్గ ప్రజలకు మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీశ్ రావు మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పర్వదినాన్ని ప్రజలంతా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆ పరమేశ్వరుని అనుగ్రహముతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, మహా శివరాత్రి రోజున స్వామి వారి ఉపవాస దీక్ష లో ప్రజలందరూ స్వామిని కొలిచి మీ కోర్కెలు నెరవేరాలి అని అన్నారు.

అన్ని రంగాలలో సమన్యాయం కల్పించాలి

ఐకెపి సిసి కవిత, క్లస్టర్ చేబర్తి

నవతెలంగాణ-మర్కుక్



'అవనిలో సగం.. ఆకాశంలో సగం,ఈ సమస్త సృష్టికి మూలం మహిళ, ఒకప్పుడు వంటింటికి మాత్రమే పరిమితం అనే భావన నుంచి.. ఇప్పుడు పరిమితులు లేని విశ్వవ్యాప్తమైంది. గల్లీ నుంచి గగనయానం వరకూ ఆమె సాధించని ఘనతే లేదు. మహిళలలు, ఉన్నత శిఖరాలను చేరుకుని పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు.' అని ఐకెపి సిసి కవిత క్లస్టర్ చేబర్తి అన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు సమన్యాయం కల్పించాలన్నారు. 'ఎంత రాణిస్తున్నా మహిళలు ఇంకా నిత్యం అణచివేతకు గురవుతూనే ఉన్నారు మహిళలు అన్ని రంగాల్లో ముందున్నా సమానత్వం పూర్తిగా లభించలేదు. మరోవైపు చట్టసభల్లో సమానత్వం అంటూ అన్ని పేరుకే అనే చందంగా వ్యవస్థలు ఉన్నాయి.. నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలపై లైంగికదాడులు జరుగుతునే ఉన్నాయి. సమాజంలో మహిళల పట్ల ఆలోచించే విధానంలో మార్పులు రావాలి. అలా జరిగినప్పుడే స్త్రీలు సంఘంలో గౌరవం పొందుతారు.' అన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బాధితునికి అప్పగించిన ఎస్ఐ

నవతెలంగాణ-చేర్యాల



పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను స్వాధీనం చేసుకుని గురువారం బాధితునికి ఎస్ఐ దామోదర్ అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్ మాట్లాడెతే చేర్యాల పట్టణానికి చెందిన హాజీబాబా తన మొబైల్ ఫోన్‌ను 2023 డిసెంబర్ 28న పోగొట్టుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వెబ్సైట్లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి బ్లాక్ చేశారు. ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం చేర్యాల పోలీసులకు చేరింది. సమాచారం అందుకున్న పోలీసులు ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితునికి పోలీస్ స్టేషన్‌లో అందజేశారు. ఎవరైన ఫోన్ కోల్పోయినా, వారు వెంటనే ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చన్నారు. తద్వారా కోల్పోయిన ఫోన్‌ను తిరిగి తొందరగా పొందుతారని తెలిపారు

సీసీ రోడ్డును ప్రారంభించిన నాయకులు

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని పాతూరు గ్రామంలో ఎన్ఆర్జీఎస్ నిదుల నుంచి మంజూరు చేసిన రూ.5 లక్షలతో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. పాతూరు తాజా మాజీ సర్పంచులు ఉప్పరి అరుణ నర్సింలు, పాములపర్తి తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తండా కనకయ్యలు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు యాదగిరి, మండల యూత్ అధ్యక్షులు, నర్సింలు, గ్రామ శాఖ అధ్యక్షులు నర్సింలు, వార్డు మెంబర్స్ అంజి, నర్సింలు, యూత్ నాయకులు వేణు గౌడ్, శేఖర్, కృష్ణ, మధు, రాజు, నర్సింలు, కనకయ్య, నర్సింలు, లింగం తదితరులున్నారు.

ఇందిరాగాంధీ స్ఫూర్తితో రాజకీయాల్లోకి

మామిడ్యాల మొదటి సర్పంచ్ పచ్చిమడ్ల నాగరాణి మొదటిసారి పోటీ చేసి గెలుపు

తెలంగాణ -ములుగు



ఇందిరాగాంధీ స్ఫూర్తితో రాజకీయాలలోకి వచ్చానని మామిడాల ఆర్ అండ్ ఆర్ కాలనీ మొదటి సర్పంచ్ పచ్చిమడ్ల నాగరాణి తెలిపారు. రాజకీయాలలో చురుకుగా పాల్గొన్న ఆమె గ్రామంలో ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారు. కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామం అయిన మామిడాలలో ఆఖరి సర్పంచిగా కొనసాగానని అనంతరం నూతన ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మించిన అనంతరం మొదటి సర్పంచిగా ఉన్నానని అన్నారు. తానున్న సమయంలోనే కొంతమందికి నూతన రేషన్ కార్డులు ఇప్పించానని తెలిపారు గ్రామంలో నూతన గ్రామపంచాయతీ సచివాలయం నిర్మించాననీ తెలిపారు. ప్రతిపక్షంలోనే చురుకుగా కొనసాగిన తాము కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజకీయాలలో ముందుంటామని తెలిపారు. గ్రామానికి తన వంతు కృషి చేశానని ఆమె తెలిపారు. ఇందిరా గాంధీ కూడా స్వయంకృషితో ముందుండేదని, అదేవిధంగా ప్రయత్నం చేస్తున్నానని అన్నారు

ఎస్ఐని కలసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మర్కుక్



మర్కుక్ ఎస్ఐ చల్ల మధుకర్ రెడ్డిని బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షులు , జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ గురువారం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, మొర్రు శ్రీనివాస్ రెడ్డి,తదితరులున్నారు.

15వేల నాణేలతో 10అడుగుల భారీ శివలింగం

నవతెలంగాణ- గజ్వేల్



మహా శివరాత్రి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని వినూత్న తరహాలో 15వేల నాణేలను ఉపయోగించి 10అడుగుల భారీ శివ లింగాన్ని, త్రిశూలాన్ని 2రోజులు శ్రమించి రూపొందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి భక్తిని చాటుకున్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డ్ గ్రహీత రామకోటి రామరాజు చిత్రీకరించారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నర్సారెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం సికింద్రాబాద్ అల్వాల్‌లో జరిగిన ఓ అధికార కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి కలిశారు. అక్కడనే ఉన్న మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తో కలిసి గజ్వేల్ సమస్యలపై చర్చించారు. గజ్వేల్ నియోజకవర్గం లోని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సీఎం దృష్టికి తీసుకుపోయారు. రానున్న పార్లమెంటు ఎన్నికలపై అక్కడ చర్చకు వచ్చినట్లు తెలిసింది.

ఉమా మహేశ్వర స్వామి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు

నేటి నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు

నవతెలంగాణ-మర్కుక్





మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామంలో గల శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుండి ప్రారంభం కానున్నాయి. కాకతీయ నిర్మాణ శైలిలో నిర్మితమై సుమారు 500సంవత్సరాలకు పూర్వమే నిర్మాణమైన అంగడికిష్టాపురం గ్రామంలో కొలువు దీరిన శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి పంచాహ్నిక బ్రహ్మోత్సవములు ఈ నెల 8న ప్రారంభమై ఈ నెల 12 వరకు 5 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించబడతాయని అంగడికిష్టపూర్ ఉమామహేశ్వర ఆలయ చైర్మన్ బల్లి శ్రీనివాస్ గుప్తా, పురోహితులు ,ఆలయ ధర్మ కర్త గుండంభట్ల వెంకట నర్సింహ శర్మ, నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో శైవాగమ పద్దతిలో పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని, నిత్య పూజల కోసం పూర్వమే జాగీరిదారులు 25 ఎకరాల భూమి ఆలయానికి ఇచ్చారని, రాష్ట్రంలో ఈ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 10,11,12లలో అన్నదాన కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

8 న శుక్రవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, మృత్సంగ్రహణము, అఖండ దీప స్థాపన, మాతృకాపూజ, దేవతాహ్వానము, బ్రహ్మాది కళశస్థాపన, సామూహిక రుద్రాభిషేకములు, నందివాహన సేవ, హారతి, తీర్థ ప్రసాద వితరణ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

9న శనివారం ఉదయం ప్రాత్ఃకాల పూజ, కళశస్థాపన, అగ్నిప్రతిష్ట, మూలమంత్ర హవనములు, రుద్ర హవనము. ప్రదోషకాల పూజ, సాయం ఔపాసనము, నందివాహన సేవ, హారతి, తీర్థ ప్రసాద వితరణ.

10న ఆదివారము తేదిప్రాత్ఃకాల పూజ, హవనము,ధ్వజారోహణము, గరుడ ప్రసాద వితరణ, నందివాహన సేవ, యెదుర్కోళ్ళు, శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవము. అనంతరం బలిహరణము,భేరిపూజ, గజవాహన సేవ కార్యక్రమాలు జరపబడును. కుక్కల ఐలయ్య బృందం పెద్దపల్లి వారిచే ఒగ్గు కథ అగ్ని గుండ ప్రవేశము వీరముష్టి వారిచే ప్రభలు తీయుట పుల్లూరు నాగరాజు తీగుల్ అయ్యవారిచే అగ్నిగుండ ప్రవేశము.

11న సోమవారం ప్రాత్ఃకాల పూజ, అభిషేకము, బలిహరణము, హవనము,శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతము, రాత్రికి ప్రదోషకాల పూజ, సాయం ఔపాసనము, బలిహరణము, హారతి, తీర్థ ప్రసాద వితరణ రథోత్సవము.

12న ప్రాతఃకాల పూజ, అభిషేకము, హవనము, చక్రతీర్థము, క్షేత్రబలి, మహా పూర్ణాహుతి, అనబృదము, మహాదాశీర్వచనము, ఋత్విక్ సన్మానము, సమయానుకూలంగా ఆధ్యాత్మిక, ధార్మిక సేవా కార్యక్రమములు జరుగును.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు పూర్తి

ఆలయ కమిటీ చైర్మెన్ బల్లి శ్రీనివాస్ గుప్తా



నేటి నుండి జరిగే ఉమా మహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం.ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

మహిళల శ్రమను గుర్తించాలి

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలి
ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత

నవ తెలంగాణ- సిద్దిపేట అర్బన్



మహిళల శ్రమను గుర్తించి, 33 శాతం రిజర్వేషన్ కల్పించి అన్ని రంగాలు కల్పించి ఉపాధి కల్పించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జాలిగపు శిరీష అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం జరగ గా. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత హాజరయ్యారు. సమాజంలో సమానత్వం కావాలని 18వ శతాబ్ద కాలంలో ప్రపంచవ్యాప్తంగా నారీమని పోరాటం చేయడం మూలంగా 1911లో మొట్టమొదటిసారిగా ఐక్యరాజ్యసమితి గుర్తించి ఫిబ్రవరి 23వ తేదీన (స్థానిక క్యాలెండర్ ప్రకారం మార్చి 8) ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరపాలని సూచించారని ఆశాలత అన్నారు. నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహిళలపై లైంగికదాడులు హత్యలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదనీ, పైగా నేరస్తులు బిజెపి ఎంపీలు కావడంతో వారిని సమర్థించుకునే స్థితిలోకి వెళ్లిపోయిందన్నారు. భారతదేశంలో మహిళల పట్ల పాలకుల చిత్తశుద్ధి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. ఇలాంటి విధానాలకు అవకాశం ఇస్తున్న ప్రభుత్వాలను కూల్చాలని అన్నారు. స్త్రీ శ్రమను గుర్తించే సమాజంలో సగభాగం అవకాశం కల్పించి అన్ని రంగాల్లో ముందు ఉండటానికి ప్రోత్సహించాలని అట్లాంటి విధానాలు చేపట్టాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజు కుమార్, స్నేహ ఇంటి పని వారిలా సంఘం అధ్యక్షురాలు దండు లక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు అందరి కంటే భిన్నమైన వాతావరణం

జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్

నవ తెలంగాణ - సిద్దిపేట



అందరి స్త్రీల కంటే భిన్నమైన వాతావరణం మహిళా ఉద్యోగులకు ఉంటుందని, ఉద్యోగాలు చేస్తున్న మహిళలు ఇంటి బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలు కూడా నిర్వర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని టీఎన్జీవో సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు పబ్లిక్ సర్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో జరిగాయి. సిద్దిపేట టీఎన్జీవోస్ ఉపాధ్యక్షురాలు వినయ సుకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సరోజ, అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగంలో ఉన్న స్త్రీలు సమాజం పట్ల పూర్తిగా అవగాహనతో ఉండాలని, పిల్లల బాధ్యతలు, ఇంట్లో బాధ్యతలతో పాటు ఆఫీస్ బాధ్యతలను కూడా చక్కగా నిర్వర్తించి సమాజానికి మంచి గుర్తింపు తీసుకొచ్చినటువంటి మహిళలు ఎందరో ఉన్నారని, జీవితం లో చాలా నేర్చుకోవాలని అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను కచ్చితంగా ఎదుర్కోవాలని, మహిళలపై వివక్షను చూపుతున్న వారిని ఎదుర్కోవాలని, వీటన్నిటిని ఎదుర్కొని నిలబడిన నాడు జీవితంలో మనం ముందడుగు వేసినట్టు అని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రమ్ రెడ్డి , జబిన సుల్తానా, అరుణ, అనురాధ ,జమున రాణి, శ్వేత ,సుజాత, పుష్పలత, టీఎన్జీవోస్ సహాధ్యక్షులు నిమ్మ సురేందర్ రెడ్డి, కోశాధికారి అశ్వక్ అహ్మెద్, పోతుల సత్యనారాయణ, సిద్దిపేట టౌన్ అధ్యక్షులు కార్యదర్శి శశిధర్ ,పవన్ కుమార్ , కలెక్టరేట్ కార్యదర్శి నగేష్ పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌లో ఘనంగా మహిళాదినోత్సవం

నవ తెలంగాణ -గజ్వేల్



గజ్వేల్ పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ లో గజ్వేల్ ఐ ఆస్పత్రి డాక్టర్ మహేష్,విజయ శ్రీ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించి పాఠశాల విద్యార్థులకు, మహిళలకు, గజ్వేల్ పట్టణ ప్రజలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు మహేష్,విజయశ్రీ లు మాట్లాడుతూ నయనం నేత్రం ప్రధానం అని మానవ శరీర భాగంలో అతి ముఖ్యమైనవి మన కళ్ళు అని అన్నారు. మహిళల దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు ఈ నెల మొత్తం కంటి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించబడతాయని డాక్టర్ మహేష్ తెలిపారు. సుమారు 60 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కళ్లద్దాలు కంటి ఆపరేషన్లకు సంబంధించి తగు సూచనలు చేశారు. అనంతరం సరస్వతి శిశు మందిర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో మహిళల దినోత్సవం పురస్కరించుకొని ఇటీవల గజ్వేల్ పట్టణానికి సంబంధించిన ఎ. మృణాళిని ఇటీవల నిర్వహించిన పరీక్షలలో ఏకంగా 5 గవర్నమెంట్ ఉద్యోగాలు సాధించినందుకు గాను కళాశాల ప్రిన్సిపాల్ ఘనంగా శాలువాతో సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ హరిణ పవన్ మాట్లాడుతూ మణాళిని ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. డాక్టర్లకు శాలువతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి శిశు మందిర్ అధ్యాపకులు, మహిళలు, గజ్వేల్ ఐ ఆసుపత్రి స్టాఫ్ అంకిత, రాజ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలి

నవతెలంగాణ-చేర్యాల



చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదని, ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని చేర్యాల సీఐ ఎల్.శ్రీను అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి,సీసీ కెమెరాలు, ఈవిటీజింగ్ తదితర అంశాల గూర్చి సీఐ, ఎస్ఐ దామోదర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్ తో కలిసి సీఐ శ్రీను మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు పెద్దపీట వేయడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులను విద్యను నేర్పిన గురువులను జీవితంలో ఎప్పుడూ మర్చిపోవద్దని తెలిపారు. సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దని,తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. ఎవరైనా వేధించినా రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100, కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్ రెడ్డి, అధ్యాపకులు హుస్నాబాద్ షీ టీమ్ బృందం సదయ్య , హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబులు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ, శివకుమార్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగమేశ్వర ఉత్సవాల్లో వంటేరు

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ మండలం కోమడిబండ గ్రామంలో సంగమేశ్వర స్వామి గజ స్థంభం హెూమం మహెూత్సవ కార్యక్రమంలో ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. గురువారం కోమటి బండ గ్రామంలో సంగమేశ్వర స్వామి ఉత్సవాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్ పటేల్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నేత జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగెగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా తిప్పారపు మల్లేశం




నవతెలంగాణ-బెజ్జంకి

మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పాపన్నపల్లేకు చెందిన తిప్పారపు మల్లేశం నియమితులయ్యారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆదేశానుసారం గురువారం మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి మల్లేశంకు నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి,మండల కాంగ్రెస్ నాయకులకు మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు.మంకాల ప్రవీన్, బండిపెల్లి రాజు,మాజీ ఉప సర్పంచ్ బండి వేణు యాదవ్,జెల్ల ప్రభాకర్,ఇస్కిల్ల ఐలయ్య, బోనగిరి మహేందర్ పాల్గొన్నారు.

మహిళ దినోత్సవ వేడుకలు


-కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీటీసీ కవిత

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని దాచారం గ్రామ పంచాయతీ కార్యాలయం అవరణం వద్ద ముందస్తు మహిళ దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ కడగండ్ల కవిత హజరై ఎంపీటీసీ కొలిపాక రాజు,గ్రామ మహిళలతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. మండలంలోని మహిళలందరికి జెడ్పీటీసీ కడగండ్ల కవిత మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సురేశ్,అంగన్వాడీ ఉపాధ్యాయులు,గ్రామ మహిళలు హాజరయ్యారు.

అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వ నిధులు ఇవ్వలేదా..?



ఎంపీపై ఎమ్మెల్యే వాఖ్యలను ఖండించిన మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి హమీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు,పల్లె ప్రకృతివనాలు, పలు అభివద్ధి పనులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమిచ్చిన నిధులు కావా అని ఎమ్మెల్యే కవ్వంపల్లిని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరివేద మహిపాల్ గురువారం ప్రశ్నించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్,కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేసిన వాఖ్యలను మహిపాల్ రెడ్డి ఖండించారు.

కుమ్మరి కులస్తులకు మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వాలి

- టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం


నవ తెలంగాణ - సిద్దిపేట



ఈ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నలుగురు బీసీలకు ఎంపీ టికెట్లు ఇవ్వాలని నిర్ణయించినందున, రాజకీయాలలో కుమ్మరి కులానికి ప్రాధాన్యత లేనందున తనకు మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వాలని టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. గురువారం ఆయన సిద్దిపేటలో మాట్లాడుతూ అధికారంలో కాంగ్రెస్ పార్టీ లేనప్పటి నుండి పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేశానని, అసెంబ్లీ ఎన్నికలలో టికెట్ వస్తుందని ఆశించినప్పటికీ రాలేదని అన్నారు. అధిష్టానం అవకాశమిస్తే మెదక్ ఎంపీ కి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నాలుగు టికెట్లు బీసీలకు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. భవన నిర్మాణ రంగా కార్మికుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నానని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి తాను నమ్మిన బంటునని, ఎన్నో సంవత్సరాలుగా ఆయనతో కలిసి పని చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న 6 గ్యారంటీలకు ప్రజల నుంచి మంచి స్పందన ఉందన్నారు.

మౌంటెన్ సైక్లింగ్ రేస్ పోటీలు ప్రారంభించిన డివైఎస్ఓ

నవ తెలంగాణ - సిద్దిపేట



పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ వద్ద గురువారం ఉదయం మౌంటెన్ సైక్లింగ్ రేస్ పోటీలను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి నాగేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్లో ఇస్తున్న శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం జరిగిన పోటీలలో అండర్ -14, 15 కిలోమీటర్ల దూరం మాస్ స్టాట్ విభాగంలో పి. కిషోర్ గోల్డ్ మెడల్, జి. సుప్రీత్ సిల్వర్ మెడల్, డి. శ్రీ చరణ్ బ్రాంచ్, టైం ట్రావెల్ లో ఏ. దీపక్ గోల్డ్ మెడల్, జి. శ్రీధర్ సిల్వర్ మెడల్, కే జానకి రామ్ బ్రాంచ్ మెడల్స్ సాధించారు. అండర్ 16 మాస్ స్టాట్ లో బాయ్స్ ప్రణయ్, పవన్, లాలూ ప్రసాద్, టైం ట్రావెల్ లో ప్రసాద్, నిఖిల్, జస్వంత్, బాలికల విభాగం అండర్ 14 , 15 కిలోమీటర్ల దూరంలోలో అర్చన, వర్షిత, టైం ట్రావెల్ లో లిఖిత, రిజ్వానా,

మహిళా విభాగంలో రాజమణి, మౌనిక, బాలుర భాగంలో లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. ఈనెల 9 ,10 తేదీలలో మెదక్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీళ్లు పాల్గొంటారని ఖేలో ఇండియా కోచ్ సంజీవ్ తెలిపారు. స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు జగపతి వెంకట్ నర్సయ్య, శ్రీనివాసులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు.



నిర్మాణాలపై ఫిర్యాదులు, విచారణకు అధికారులు

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్



సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలోని కొన్ని నిర్మాణాలకు అనుమతులు లేవని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్,సిద్దిపేట కు చెందిన కొండల వాడి సతీష్ ఫిర్యాదు మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున్ రెడ్డి,ఇంచార్జి ఎం పి డి ఓ శ్రీనివాస్‌రావు గురువారం విచారణకు వచ్చారు.విచారణ జరిపి సంబంధిత వ్యక్తులు, సిబ్బందిని పిలిచి వారితో వాంగ్మూలం తీసుకొని సంబంధిత డాక్యుమెంట్స్ వాంగ్మూలం పై సూడా కార్యాలయంలోలో విచారణ జరిపి డి పి ఓ పంపించి తదుపరి విషయాలను వెల్లడిస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

బిల్డింగ్‌కు సంబంధించి అన్ని అనుమతులు ఉన్నాయి
ప్రవీణ్ రెడ్డి మాజీ పిఎసిఎస్ చైర్మన్

గ్రామంలో నేను నిర్మాణం చేపట్టిన బిల్డింగుకు సంబంధించి వచ్చిన ఆరోపణలు అవాస్తవం. నాకు అన్ని అనుమతులు ఉన్నాయి. బిల్డింగ్ నిర్మాణానికి సంబంధించి 2023 జనవరిలోనే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగింది. అనుమతి రావడంలో పై స్థాయిలో జాప్యం జరిగింది. ఈ నెలలో బిల్డింగ్ నిర్మాణానికి సంబంధించి అన్ని అనుమతులు రావడం జరిగింది నిర్మాణానికి సంబంధించి 33% ఫైన్ రూపంలో కూడా అమౌంట్ చెల్లించడం జరిగింది. ప్రస్తుతానికి నాకు అనుమతులు ఉన్నాయి.

విచారణ జరిపి అనుమతి కాపీ అందివ్వాలి
చింతల శ్రీనివాస్ పిఎసిఎస్ చైర్మన్

గ్రామ పరిధిలోని 59 జీవో మెరుపు గుట్ట దార గుట్ట అక్రమ తవ్వకాలు మరియు గ్రామంలోని అనుమతులు లేని నిర్మాణాలపై మేము ఇచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలి. విచారణ కాపీని మాకు అందజేయాలి.

పంచాయతీ కార్మికులకు వస్త్రాల పంపిణీ

నవ తెలంగాణ - మిరు దొడ్డి



మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామపంచాయతీ కార్మికులకు ఎంపీడీవో గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో వస్త్రాలను అందజేశారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని మహిళ పంచాయతీ కార్మికులకు పంచాయతీ కార్యదర్శి ఫహీమ్ తో కలిసి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గణేష్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన మహిళలు సద్వినియం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జహీరుద్దీన్, కారోబార్ కుమార్ పలువురు పాల్గొన్నారు.

దాత ఇచ్చిన వాటర్ ప్లాంట్ నిర్వహణపై నిర్లక్ష్యమెందుకు



నవతెలంగాణ-కొమురవెల్లి

భక్తులకు మంచినీటి సౌకర్యం కోసం ఓ దాత అందించిన వాటర్ ప్లాంట్‌ను ఆలయ ఈవో నిర్లక్ష్యంతోనే మూలన పడేసారని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి విమర్శించారు.. భక్తుల దాహార్తిని తీర్చే వాటర్ ప్లాంట్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు అధిక ధరలకు అమ్ముతున్నారని అన్నారు. మల్లన్న కళ్యాణానికి ప్రారంభించి తర్వాత వదిలేస్తున్నారని అన్నారు. సామాన్య నిరుపేద భక్తుల దాహార్తి తీర్చేందుకు దాత ఇచ్చిన ప్లాంట్ ఎలాంటి ఉపయోగం లేకుండా ఉండిపోతుందన్నారు.ప్లాంట్ నిర్మాణం జరిగిన నాటి నుండి ఏ ఒక్క రోజూ భక్తుల దాహార్తిని తీర్చిన సందర్భం లేదని ఇది ముమ్మాటికి ఆలయ అధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. వెంటనే వాటర్ ప్లాంట్ ను పునరుద్ధరించి భక్తులకు మంచినీటిని అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆలయ ఈవో బాలాజీని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కిష్టారెడ్డి, తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, నాయకులు తేలు ఇస్తారి, సార్ల యాదయ్య, వుల్లంపల్లి సాయిలు, తాడూరి మల్లేశ్, ఆరుట్ల రవీందర్, గోరేమియా, బాలస్వామి పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులుతో అధికారుల సమావేశం



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

రానున్న లోక్ సభ సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనంగా ఓటర్లున్న పోలింగ్ కేంద్రాల పరిధిలో సహాయక కేంద్రం ఏర్పాట్లు, ఇతర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. శాసనసభ ఎన్నికలలో సహకరించిన విధంగానే రాబోయే లోక్ సభా సాధారణ ఎన్నికలను కూడా విజయవంతంగా నిర్వహించడానికి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎలక్షన్స్ సూపరింటెండెంట్ మధుసూదన్, ఎలక్షన్ డిటి శ్రీనివాస్, బిజెపి ప్రతినిధి విధీషన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి మోహన్‌లాల్, ఎంఐఎం ప్రతినిధి మునిరుద్దీన్ మరియు ఇతర పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సృష్టికి మూలం మహిళ

- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సృష్టికి మూలం మహిళనేనని ఘంటాపథంగా చెప్పవచ్చు.కాలానుగుణంగా సమాజంలో ఎన్నో కష్టాలు,బాధలు అన్నింటిని తట్టుకుంటు జీవతగమనంలో ముందుకు సాగుతూనే అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తమదైన శైలిలో ప్రముఖ కీలక పాత్రను పోషిస్తూ పలు రంగాల్లో రాణిస్తున్నారు నేటి మహిళలు.వ్యాపారం,రాజకీయం,సేవా ఇలాంటి ప్రతి రంగంలో తమదైన ముద్ర వేస్తున్నారు.అటు కుటుంబానికి,ఇటు వృత్తికి సమాన ప్రాధాన్యతనిస్తూ పురుషులు మాత్రమే చేయగలరు అనే భావనను పటాపంచలు చేస్తూ మహిళలు అవలీలగా అన్ని పనులు చేయగలరని నిరూపిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లాలించే అమ్మగా,ఆప్యాయతను పంచే సోదరిగా, ప్రేమించే ప్రియురాలిగా,జీవితాంతం తోడుండే సహచరిగా ఎన్నో పాత్రలు పోషిస్తూ సష్టికి ప్రతిరూపంగా నిలుస్తుంది మహిళ.

నవతెలంగాణ-బెజ్జంకి

మారుతున్న కాలానికి అనుగుణంగా నేటీ మహిళలు పురుషులతో సమానంగా పోటి పడుతూ అన్ని రంగాల్లో తమదైన శైలిలో సత్తా చాటుతున్నారు. అవని నుండి అంతరిక్షం వరకు ప్రతి చోట తనదైన ముద్రవేస్తూ ముందుకు వెళు న్నారు.పలుచోట్ల లింగ వివక్ష ఆనవాళ్ల ఉన్న సంఘటనలు వేలుగుచూస్తునే ఉన్నాయి. సామాజిక వెనుకబాటును తరిమికొట్టే శక్తిగా మహిళాలోకం స్వశక్తమవ్వాలి. సమాజ నిర్మాణంలో సగబాగమైన స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలం. ఈ నినాదంతో ఐక్యరాజ్య సమితి ప్రతి ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.మహిళలు పురుషులతో సమాన స్థాయికి చేరుకోకపోవడానికి విద్య,ఇతర అవకాశాలను పురుషులతో సమానంగా అందించకపోవడమే ప్రధాన కారణం. సామాజికాభివద్ధిలో మహిళల శ్రమకు సరైన ప్రాధాన్యత లేకపోతే సమాజాభివద్ధి చెందదని పలువురి సామాజిక వేత్తల అభిప్రాయం .

అంతర్జాతీయ మహిళా దినోత్సవం.

1857 మార్చి 8న పెద్ద సంఖ్యలో మహిళా వర్కర్లు తక్కువ వేతనాలు, అమానుషమైన పద్దతిలో ఎక్కువ గంటల పనికి వ్యతిరేకంగా సమ్మె చేశారు. 1910లో కోపన్ హగన్ మీటిగ్ లో ఉమేన్స్ సోషలిస్టు ఇంటర్నేషనల్,1857లో జరిగిన సమ్మెకు గుర్తుగా "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" జరుపుకోవాలని నిర్ణయించారు.శాంతి, సమాజపురోగతి,మానవ హక్కుల పూర్తి వినియోగం, ప్రాథమిక హక్కుల పరిరక్షణ లాంటివి సాధ్యమవ్వడానికి మహిళా ప్రమేయం కీలకమని గుర్తించారు.ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది.అప్పటి నుంచి ప్రతి యేటా మార్చి 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత

మహిళలు వేగంగా దినదినాభివద్ధి చెందుతున్నారు. దశాబ్దం క్రితం మహిళలకు నేటి మహిళలకు ఎంతో వ్యత్యాసం వుంది. అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ దూసుకు పోతున్నారు. ప్రభుత్వ,ప్రైవేటు ఉద్యోగ,రాజకీయాల రంగాల్లో కీలక పాత్ర పోషిస్తూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారు.



-కనగండ్ల కవిత,జెడ్పీటీసీ,బెజ్జంకి

ప్రత్యేక చట్టాలున్నా...తప్పని కష్టాలు

గర్భస్థ శిశువు దశ నుంచి వద్ధాప్య దశ వరకు మహిళలు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సివస్తుంది. అమ్మ కడుపులోనే తోలి గండాన్ని దాటలేకపోతున్న ఆడబిడ్డలు కోందరుండగా, భూమ్మీదకు వచ్చాక జీవితాంతం భాద పడుతున్నవారు ఎందరో ఉన్నారు. ఎదిగే వయస్సులో ఇంట్లో వ్యత్యాసం , ఎదిగాక ప్రేమ పేరుతో వేదింపులు, అంగీకరించకపోతే దాడులు, పని చేసే ప్రదేశంలో తోటివారు, పెళ్ళయ్యాక అత్తింటివారి వేధింపులు ఇలాంటి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి నేడు ఉంది. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కషి చేసి మహిళల చట్టాలపై అవగాహన కల్పిస్తే ఈ పరిస్థితుల నుండి మహిళలకు విముక్తి కలిగే అవకాశం లేకపోలేదు. పదవులు సతులవే అయినా పెత్తనం మాత్రం పతులే కొనసాగిస్తున్నారనేది జగమెరిగిన సత్యం.

మహిళలు రాజకీయంగా ముందుండాలి

మహిళలు రాజకీయంగా ముందుండాలి.వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోకి రావాలి. ప్రభుత్వం చేపడుతున్న రిజర్వేషన్లను మహిళలు సద్వినియోగం చేసుకున్నప్పుడే సమాజంలో ఎదుగుతారు.

ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-తొగుట

ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం పెద్ద మసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠ శాలలో పనిచేసే ఉపాధ్యాయులు కవిత, శ్రీలత, మమత, భాగ్యలక్ష్మి, విద్యార్థులకు భోజనాలు అందించే మధ్యాహ్నం భోజనం కార్మికులు నరసమ్మ, కిష్టమ్మ, రమణమ్మ, భారతమ్మ లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, దుర్గా రెడ్డి, శ్రీకాంత్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలి



నవతెలంగాణ-సిద్దిపేట

ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా పని చేసిన ఉపాధ్యాయులను, వారికి సహకరిస్తున్న డి ఐ ఈ ఓని విధుల నుండి తొలగించాలని ఏఐపిఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె కుమార్ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఇంగ్లీష్ టీచర్ సునిత, సి ఎస్ రవి, డి ఓ రాజు , సహకరిసున్న డిఐఈఓ సూర్యప్రకాష్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డు సెక్రటరీ శృతి ఓజా, ఎగ్జామినేషన్ కంట్రోలర్ జయప్రదబాయ్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దేశ ఆర్థిక ప్రగతికి మహిళల ముందడిగే కీలకం : ఎంపీపీ లావణ్య అంజన్ గౌడ్



నవతెలంగాణ-ములుగు

మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీపీ లావణ్య అంజన్ గౌడ్ మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులను జూనియర్ అసిస్టెంట్లను సన్మానించారు. ఆమె మాట్లాడుతూ దేశ ఆర్థిక ప్రగతికి మహిళల ముందడుగు కీలకమని ఆమె తెలిపారు. దేశ ప్రగతి మహిళా సాధికారత మీద ఆధారపడి ఉందని, మహిళా సాధికారత లేకుండా దేశ శ్రేయస్సును ఊహించలేమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కెవిఆర్ శర్మ ఎంపీ ఓ నరసింహారావు సూపర్డెంట్ రామచంద్రం మండల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా మచ్చ శ్రీనివాస్



నవతెలంగాణ-దుబ్బాక

కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి (స్పోక్ పర్సన్) గా దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన మచ్చ శ్రీనివాస్ నియామకమయ్యారు. గురువారం సి ఎస్ ఆర్ క్యాంపు కార్యాలయంలో దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఈ నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి,దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాస్ రెడ్డిలకు శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్,దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్మెట్ట ఏసురెడ్డి,మండల అధ్యక్షుడు కొంగరి రవి,కాంగ్రెస్ దుబ్బాక అసెంబ్లీ కన్వీనర్ ఆకుల భరత్,దేవుని రాజు,సలీం తదితరులున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల పరిధిలోని దొమ్మాట, ముస్త్యాల గ్రామాలలో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. జనగామ నియోజక వర్గానికి నిధులు తెచ్చి మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దూరు జడ్పిటిసి గిరికొండల్ రెడ్డి, నాయకులు కొమ్మురవి, ము స్త్యాల యాదగిరి,కాటం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ సాధికారతతోనే మహిళలకు న్యాయం

- సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్.



నవతెలంగాణ -రాయపోల్

ఆడపిల్ల పుట్టినప్పటి నుండి అనేక అవమానాలకు, దాడులకు, లైంగికదాడులకు గురవుతున్నారని మహిళలు అంటేనే బానిసలుగా చూస్తున్న ఈ దేశంలో మహిళా సాధికారత సాధిస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని ఎస్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతినిత్యం మహిళలపై దేశవ్యాప్తంగా ఎన్నో దాడులు జరుగుతున్నాయని, రోజు రోజుకి మహిళల పట్ల హింస పెరిగిపోతుందని మహిళలకు రక్షణ కరువైందన్నారు. హిందూకోడ్ బిల్లు గనుక చట్టంగా మారితే ఈ దేశంలో మహిళలపై ఇంత వివక్ష ఉండేది కాదు. మహిళలకు న్యాయశాఖ మంత్రిగా ఉండి ఏం న్యాయం చేయలేకపోతున్నానని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు తన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయడం మహిళల పట్ల ఆయనకున్న అంకితబావాన్ని తెలియజేస్తుందన్నారు. మహిళ సాధికారత సాధించి పురుషులతో పాటు సమానంగా చూసిన రోజే నిజమైన మహిళ దినోత్సవం అన్నారు.

పేదల కోసమే ఇందిరమ్మ పథకం



నవతెలంగాణ- గజ్వేల్

పేదల కోసమే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకొస్తున్నారని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. గురువారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ నియోజకవర్గంలో పేదలకు ఇంద్ర మహిళ పథకం దక్కే అవకాశం ఉంటుందన్నారు.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పంపిణీ తదితర కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని ఆయన అన్నారు.

వంటేరు మహాశివరాత్రి శుభాకాంక్షలు



నవతెలంగాణ -గజ్వేల్

మహాశివరాత్రి సందర్భంగా ఎఫ్డిసి మాజీ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై పరమేశ్వరుని కరుణాకటాక్షాలు ఎప్పుడూ ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్రం పచ్చని పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలన్నారు.

గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సన్మానం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ ఎంపీటీసీ కోల సునీత మహేందర్ గౌడ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న పంచాయతీ కార్మికులు, ఐకేపీ సీఏలు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బందికీ, గ్రామ మహిళా సమైక్య సంఘం మహిళలను శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు గుడికందుల పద్మ, పంచాయతీ కార్యదర్శి దేవులపల్లి చంద్రకళ, వార్డు సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పంచతంత్ర పాఠశాల లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-చేర్యాల

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను గురువారం చేర్యాల పట్టణ కేంద్రంలోని పంచతంత్ర పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు ఆటలపోటీలు నిర్వహించారు.పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల, ఉపాధ్యాయులు స్నేహ, కీర్తన, సంధ్య, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత, కేసు నమోదు



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం అక్కెనపల్లి పెద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిసున్న అక్కెనపల్లి గ్రామానికి చెందిన ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రాజగోపాల్ పేట ఎస్సై యు.భాస్కర్ రెడ్డి తెలిపారు.వాగు నుంచి అక్రమం గా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు రాజగోపాల్ పెట్ ఎస్సై, పోలీసుల ఆధ్వర్యంలో అక్కెనపల్లి గ్రామ పెద్ద వాగు లోకి వెళ్ళారు. ఇసుక ట్రాక్టర్లను రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.గ్రామానికి చెందిన నూనె రాజు, జంగోని శ్రీకాంత్, సందెబోయిన మల్లేశం,తిప్పని చంద్రశేఖర్,పూదరి వంశీ, గోనెపల్లి మల్లయ్య ల ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామని చెప్పారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-చేర్యాల

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని ఉన్నత పాఠశాల లో విధులు నిర్వహిసున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. సుజాత, శైలజ,సావిత్రి, రమ తోపాటు సీఆర్పీ రజని,అటెండర్ భాగ్యమ్మ, పారిశుధ్య కార్మికురాలు ప్రమీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. ఐలయ్య, ఇతర ఉపాధ్యాయులు కలిసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

బిసి స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్ -1 నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ- సిద్దిపేట: బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్-1 ప్రిలిమ్స్ కు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సరోజ తెలియజేశారు. జిల్లాలోని గ్రూప్ -1 నిరుద్యోగ అభ్యర్థులందరూ ఇట్టి ఉచిత శిక్షణ అవకాశాన్ని నేరుగా వచ్చి ఈ నెల 12వ తేదీ లోపు సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్స్ ను 08457- 224941,9966673095 సంప్రదించాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ పి కృష్ణ దాయసాగర్ తెలిపారు. శనివారం, ఆదివారం రోజున కూడా దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు.

నూతన చైర్మన్ కు ఓరుగంటి సన్మానం



నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ నూతన చైర్మన్ గా నియమితులైన దీపక్ జాన్ ను హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్టు రాష్ట్ర ఆహార భద్రత మండలి సభ్యుడు ఓరుగంటి ఆనంద్ గురువారం తెలిపారు.అనంతరం శాలువ కప్పి సన్మానించినట్టు ఆయన తెలిపారు.

వడ్ల బస్తాల దొంగల అరెస్టు

- రూ. 1,40,000 నగదు స్వాధీనం
- ముగ్గురిపై 12 కేసులు నమోదు.. జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలింపు
- విలేకరుల సమావేశంలో సీఐ లతీఫ్ వెల్లడి





నవతెలంగాణ-కొండపాక

జిల్లాలోని పలుచోట్ల రోడ్లపై ఉన్న ధాన్యం బస్తాలను ట్రాక్టర్ ర్యాలీని చోరీ చేసిన ముగ్గురు నిందితులను కుకునూరు పల్లి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను తొగుట సిఐ లతీఫ్ గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దౌల్తాబాద్ మండలం లింగరాజు పల్లి గ్రామానికి చెందిన పోతుల సుధాకర్ వ్యవసాయం పనిచేస్తూ జీవించేవాడు. వచ్చే డబ్బులు సరిపోవడం లేదని అదే గ్రామానికి చెందిన సున్నపు దేవేందర్, సాగాని నవీన్ లతో ముగ్గురు కలిసి కల్లాలలో రైతుల వడ్ల బస్తాలు దొంగలించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేద్దామని నిర్ణయించుకున్నారని అన్నారు. ముగ్గురు నిందితులు అనుకున్న పథకం ప్రకారం రెండు నెలల క్రితం సిరసనగండ్ల గ్రామంలో రోడ్డు పక్కన ఉంచిన ధాన్యం బస్తాలను దొంగలించి వాటిని పోతుల సుధాకర్ బొలెరో వాహనంలో సిద్దిపేట కు తీసుకొని పోయి అమ్ముకున్నారని, వచ్చిన డబ్బులను ముగ్గురు పంచుకున్నారని తెలిపారు. భూంపల్లి గ్రామ శివారులో రోడ్డుపై ఉంచిన ధాన్యం 13 బస్తాలను , సామర్లపల్లి పెట్రోల్ పంపు దగ్గర రోడ్డు పక్కన 12 ధాన్యం బస్తాలను, పెద్ద మాసాన్ పల్లి గ్రామ శివారు లో వ్యవసాయ పొలం వద్ద 45 ధాన్యం బస్తాలను, చిన్న ఆరేపల్లి గ్రామ శివారులో రోడ్డుపై ఉంచిన 21 వరి ధాన్యం బస్తాలను, సిరసనగండ్ల గ్రామంలో రోడ్డు పక్కన 21 బస్తాల వరి ధాన్యం బ్యాగులను అపహరించారు. అలాగే సిద్దిపేట కృష్ణ సాగర్ వెళ్లే దారిలో ఐకెపి సెంటర్ వద్ద ఉన్న ఆరబోసిన వరి ధాన్యాన్ని ముగ్గురు కలిసి బస్తాలలో నింపుకొని బొలెరో వాహనంలో వేసుకుని సిద్దిపేటలో మార్కెట్లో అమ్మారు. కొత్తపల్లి గ్రామ శివారులో పొద్దుతిరుగుడు బ్యాగులను అపహరించి గజ్వేల్ మార్కెట్లో అమ్మారు.

కొండపాక శివారులో రోడ్డు పక్కన ఉన్న 47 వరి ధాన్యం బస్తాలను , దాని పక్కనే కల్టివేటర్ కనబడగా దాన్ని కూడా అపహరించకపోయి అమ్ముకున్నారు. వెంకట్రావుపేట గ్రామ శివారులో వ్యవసాయ పొలం వద్ద 10 బస్తాలను అపహరించి అమ్ముకున్నారు.

కొండపాక గ్రామ శివారులో ఒక ట్రాక్టర్ ట్రాలీ ని చోరీ చేసి తీసుకెళ్లారు.

తరువాత చిన్న మాసాన్ పల్లి గ్రామ శివారులో బేగంపేట రోడ్డు పక్కన ఉన్న ధాన్యం బస్తాలు దొంగలించుకుని బొలెరో వాహనంలో వేసుకొని అమ్మడానికి దాచి పెట్టారు. గురువారం ఉదయం ముగ్గురు కలిసి చిన్న మాసాన్ పల్లిలో దొంగలించిన 18 ధాన్యం బస్తాలను చేర్యాల పట్టణంలో అమ్మడానికి బొలెరో వాహనంలో వెళుతుండగా కుకునూరు పల్లి ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి కొండపాక ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. వరి ధాన్యం బస్తాలు ఎక్కడ నుండి తెస్తున్నారని అడగగా సమాధానమివ్వకుండా దిక్కులు చూడటంతో అనుమానంతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటకు వచ్చిందన్నారు. ముగ్గురు నిందితుల వద్ద నుంచి 1,40,000 నగదు డబ్బులు, ట్రాక్టర్ ట్రాలీ, దొంగతనానికి ఉపయోగించిన బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితులపై 12 కేసులు నమోదు చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు పంపించారు.

జాతీయ సీనియర్ మహిళ హ్యాండ్ బాల్ పోటీలకు స్వర్ణ ఎంపిక



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన స్వర్ణ జాతీయ సీనియర్ మహిళ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కల్వకుంట్ల విజయబాబు, గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కరీంనగర్ జిల్లాలో జరిగిన ఇండియన్ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్, తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 52వ సీనియర్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో మెదక్ జిల్లా జట్టు తరపున స్వర్ణ పాల్గొని మంచి నైపుణ్యం కనబరచిందన్నారు. ఈనెల 16 నుండి 20 వరకు దాద్రానగర్ హవేలీ లో హ్యాండ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళా హ్యాండ్ బాల్ జట్టులో ఆడుతున్నట్లు ఆయన తెలిపారు. స్వర్ణ ప్రస్తుతం సిద్దిపేట జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకుంటుందని గతంలో రాష్ట్ర స్థాయి, జాతీయ పోటీల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు . జాతీయ సీనియర్ మహిళా పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి ఇండియా జట్టుకు ఎంపిక కావాలని. సిద్దిపేట జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం, సిద్దిపేట జిల్లా స్పోర్ట్స్ హబ్ కన్వీనర్ పాల సాయిరాంలు స్వర్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ సంఘం సభ్యులు తుమ్మల కనకయ్య, మహమ్మద్ ఇంతియాజ్, సరిత, నాచగోని వెంకట్ గౌడు, బాల లక్ష్మి కొమ్ము రవి, బూరుగు బాలరాజు, రాము గౌడ్, బత్తిని శ్రీనివాస్, ఎండి అన్వర్, మద్దూరు హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన మనోహర్, బూరుగు నరసింహులు, మోడల్ స్కూల్ పిడి దామెర ప్రేమ్ కుమార్, పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో 70 శాతం పన్నులు వసూలు

- మార్చి చివరి నాటికి వందశాతం పూర్తి : మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య



నవతెలంగాణ- గజ్వేల్: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, వ్యాపార రంగానికి సంబంధించిన ట్రేడ్స్ టాక్సను పనులు శరవేగంగా వసూలు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు. ఆయన చాంబర్లో గురువారం నవ తెలంగాణతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో పదివేల 800 పైగా ఇండ్లు ఉన్నాయని 70 శాతం ఇంటి పన్నులు, నల్లా బిల్లులు వసూలు చేశామని ఆయన తెలిపారు. మిగతా 30 శాతం వసూలుకు మున్సిపల్ సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన చెప్పారు. మున్సిపల్ అభివృద్ధికి ప్రజలు సహకరిస్తారని ఆయన చెప్పారు. ఇంటి పన్నులు నల్ల బిల్లులు ఇతర టాక్సీలు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా బకాయి పడ్డ ఇంటి టాక్స్ లు నల్లాబిల్లులపై 90 శాతం వడ్డీని మాఫీ చేస్తున్నామని ఆయన తెలిపారు. పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లిస్తే ఈ అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మార్చి చివరిలోగా పెండింగ్ బిల్లులు చెల్లించి అభివృద్ధికి తోడ్పడు అందించాలన్నారు. అదేవిధంగా తై బజార్ ఇరవై ఒక్క లక్ష 54 వేలు కాగా పశువుల సంత 15 లక్షల 30 రూపాయలు పలికిందని ఆయన చెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో బకాయిలు ఉన్న వారందరూ మున్సిపల్ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చినప్పుడు సహకరించి చెల్లించాలని ఒకవేళ ఇంటి యజమాని అందుబాటులో ఉండకపోతే కార్యాలయం కు వచ్చి చెల్లించాలని ఆయన కోరారు.

వరిలో గంధక దుష్ప్రభావ నివారణ చర్యలు పాటించాలి



నవ తెలంగాణ-రాయపోల్

వరిలో గంధక దుష్ప్రభావ నివారణ చర్యలు పాటించాలని, వరిపైర్లు గంధక దుష్ప్రభావం వలన తీవ్రంగా నష్టపోతున్నారని జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ అన్నారు. గురువారం రాయపోల్ మండలం రామారం గ్రామంలో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం మరియు యాసంగిలో ఒకే పొలంలో సంవత్సరాలు తరబడి వరి సాగుచేయడం వలన వరిలో "సల్ఫైడ్" దుష్ప్రభావాన్ని గమనిస్తామన్నారు.. "సల్ఫైడ్" దుష్ప్రభావం వలన 30-50 శాతం వరకు పంట దిగుబడి నష్టపోవడం జరుగుతుందన్నారు. వరిలో ఇటువంటి పరిస్థితికి కారణం స్థానికంగా అధిక నీటి ముంపు, తగిన రీతిలో పంట వేర్లకు గాలి అందకపోవటం నేలలో రసాయన చర్యల వలన మార్పు చెందడం, ఇనుము ధాతువు లోపం ఉండే పొలాల్లో అలాగే బరువు నేలల్లో సల్ఫైడ్ కలిగిన 20-20-0-13 లాంటి కాంప్లెక్సులను అధికంగా వాడటం లేదా సింగిల్ సూపర్ ఫాస్పెట్‌ని గాని లేదా అమ్మోనియం "సల్ఫైడ్"ని గాని ఎక్కువగా వాడటం వలన ఈ "సల్ఫైడ్" దుష్ప్రభావాన్ని పొలంలో గమనించవచ్చని అన్నారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు,ఏఈఓ స్వర్ణలత, రైతులు తదితరులు పాల్గొన్నారు.